## ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

## (పదకొండవ శాసనసభ)

రెండవ సమావేశము : రెండవ రోజు

గురువారము, 16 మార్చి, 2000

(సభ ఉదయం 9·00 గంటలకు సమావేశమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్షస్థానములో ఉన్నారు)

### సంతాప ప్రతిపాదన

### పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ ఎ· మాధవరెడ్డి మృతిపట్ల సంతాపము·

Sri N. Chandrababu Naidu:- Madam, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri A. Madhava Reddy, Member of the A.P. Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

మేడమ్, మీ అందరికీ తెలుసు· నిన్నటి వరకు ఈ అసెంబ్లీలో మంత్రిగా ఉంటూ, మన అందరితో ఎంతో సన్నిహితంగా ఉంటూ, ఎప్పుడూ అందరితో నవ్వుతూ మాట్లాడుతూ, ఒక పాలకపక్షమే కాకుండా, ప్రతిపక్ష సభ్యులతో కూడ చాల సన్నిహితంగా ఉంటూ, వారితో సన్నిహిత సంబంధాలు పెట్టుకొని ముందుకు పోయిన వ్యక్తి, ఈ రోజున మన మధ్య లేకపోవడం చాల బాధాకరం· అలాంటి మాధవరెడ్డిగారు ఈ రోజు మన మధ్య లేకుండా కీర్తిశేషులు కావడం నాకెంతో బాధ కల్గిస్తున్నది· ఎందుకంటే ఆయన ఎప్పుడూ చాల హుందాగా వ్యవహరిస్తూ, అదే మాదిరిగా ఎప్పుడు కష్టం వచ్చినాసరే నవ్వుతూ, అందరినీ నవ్వుతూ పలకరిస్తూ ఉండే వ్యక్తి విరోధులకు కూడ ఆయన ఎప్పుడూ చెడు తలంచలేదు· అంతేకాకుండా తాను నమ్మిన సిద్ధాంతంతో ముందుకు పోయాడు· అదేవిధంగా సిద్ధాంతాలే కాకుండా, యాక్షన్‌లో కూడ చాల ఫర్మ్‌గా ఉంటూ, నిరంతరం పనిచేయుడం జరిగింది· ఈ రోజు రాష్ట్ర రాజకీయ రంగంలో ఒక ప్రత్యేక ముద్రను ఆయన ఏర్పరచుకున్నారు· ఆయన ఏర్పరచిన ఒరవడిని చరిత్ర ఎప్పుడూ మరచిపోదని మీకు తెలియచేసుకొంటున్నాను·

ఆయన జీవిత విశేషాల గురించి ఒకసారి ఆలోచిస్తే, మాధవరెడ్డిగారు 1949, మే 1వ తేదీన నల్గొండ జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో తన తల్లిదండ్రులకు ఏడవ సంతానంగా పుట్టారు· తండ్రి ఎలిమినేటి నరసారెడ్డి, తల్లి లక్ష్మమ్మ, ప్రాథమిక విద్యను వడపర్తి గ్రామంలో పూర్తి చేశారు·

భువనగిరిలో హైస్కూల్, ఇంటర్మీడియేట్ విద్యను అభ్యసించారు. ఆ తరువాత హైదరాబాదులో ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి అందులో పట్టభద్రుడయ్యారు. ఆయన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేయగానే, గవర్న మెంట్ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా, స్వశక్తిమీద బ్రతకాలనే ఆలోచనతో ఒక ఫెర్టిలైజర్ షాప్, ట్రాక్టర్, బోర్‌వెల్‌ను బ్యాంకు నుండి తీసుకొన్న లోన్ ద్వారా కొనుగోలు చేసి జీవితంలో సెటిల్ అయ్యారు. 1981లో ఆ రోజు జరిగిన పంచాయితీ ఎన్నికల్లో గ్రామస్థుల ప్రోత్సాహంతో వడపర్తి గ్రామానికి ఏకగ్రీవంగా ఎంగ్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ వెంటనే భువనగిరి సమితికి జరిగిన ఎన్నికల్లో సమితి ప్రెసిడెంటుగా కూడ ఎన్నికయ్యారు. ఆ విధంగా అప్పటి నుండి ఆయన రాజకీయాల్లో ముందుకు పోయారు. ఆ విదంగా ఆయన విద్యార్థి దశ నుండే క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించి రాణించారు. ఆ తరువాత 1983లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985 లో భువనగిరి శాసనసభ నియోజకవర్గం నుండి తొలిసారిగా శాసనసభ్యుడిగా ఈ అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ రోజు నుండి అంటే 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో ప్రతిసారి ఎన్నికవుతూ వచ్చారు. 1989లో ఆయన యొక్క పట్టుదలను, కార్యదక్షతను చూసిన తరువాత, ఇతను ప్రజలకు బాగా సేవ చేయగలరన్న అభిప్రాయంతో ఎన్.టి.రామారావుగారి క్యాబినెట్‌లో హోమ్‌మంత్రి పదవిని ఇవ్వడం జరిగింది. 1989–94 మధ్యకాలంలో తెలుగు దేశం పార్టీ జనరల్ సెక్రటరీగా కూడ పనిచేశారు. 1989 ఎన్నికల్లో 25 వేల మెజార్టీ, 1994 ఎన్నికల్లో 45 వేల మెజార్టీ తెప్పించుకోవడం జరిగింది. 1995 నుండి మళ్లీ హోమ్ మినిస్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. 1999 ఎన్నికల్లో పంచాయితీ రాజ్‌శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలనే ఒక 'డిటర్‌మినేషన్' ముందుకు వెళ్లినటువంటి రాజకీయ నాయకుల్లో మాధవరెడ్డిగారు ఒకరు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉంటే తప్ప ఈ రోజు అభివృద్ధి సాధ్యం కాదు, పేదరిక నిర్మూలన చేయలేము అని ఆయన పదే పదే అనేవారు. ఆయన పంచాయితీరాజ్‌శాఖ మంత్రిగా పదవి చేపట్టిన తరువాత పంచాయితీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను బలోపేతం చేయాలని చెప్పి చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న అయిదు అంచెల పంచాయితీ వ్యవస్థ వల్ల డూప్లికేషన్ వస్తున్నది. అది కరెక్టు కాదు, కాబట్టి తిరిగి మూడంచెల పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పి, అన్ని ప్రతిపక్ష పార్టీల వారితో మాట్లాడి ఇదే అసెంబ్లీలో పోయిన సెషన్‌లో ఒక తీర్మానం పాస్ చేయించడం జరిగింది. ఇక్కడే కాకుండా ఢిల్లీలో కూడ అన్ని ప్రతిపక్ష పార్టీల ఎం.పి.లతో మాట్లాడి, అందుకు ప్రయత్నం చేయడం జరిగింది. అయితే కేంద్రంలో కొంత డిలే జరిగింది. ఏ విధంగా అయినా సరే త్రీ–టైర్ స్ట్రక్చర్‌ను పునరుద్ధరిస్తే ఈ రాష్ట్రానికి బాగుంటుందని భావించి ప్రయత్నించడం జరిగింది. అయితే అది రాకముందే వారు చనిపోవడం ఎంతో బాధాకరం అని మీకు తెలియచేసుకొంటున్నాను.

నేను, మాధవరెడ్డిగారు చాల సన్నిహితంగా పనిచేశాం. నాకు సహచరుడిగా పనిచేశాడు. నేను, ఆయన జనరల్ సెక్రటరీలుగా పనిచేశాం. నేను వారిని ఎప్పుడు చూసినా

ఎంతో ఉత్సాహంగా ఉండేవారు. పార్టీ కాని, గవర్నమెంట్‌గాని ఏ పని చెప్పినా, దానిని చిత్తశుద్ధితో అమలుచేశారని మీకు తెలియచేసుకుంటున్నాను.

మొన్నటి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నేను, ఆయన సూర్యాపేటలో కలిసి తిరిగాం ఆ తరువాత ఆయన అక్కడి నుండి నల్గొండకు వెళ్ళగా, నేను వైజాగ్ వెళ్ళి, తిరిగి హైదరాబాద్‌కు వచ్చాను. రాత్రి 11 గంటలకు డి.జి.పి. నాకు ఫోన్ చేసి మాధవరెడ్డిగారిని బాంబు బ్లాస్ట్ చేసి హత్య చేశారని చెప్పడం జరిగింది. అయిదు నిమిషాల వరకు నాకు అర్థం కాలేదు. ఎందుకంటే, అంతకుముందు రోజు వరకు ఇద్దరం సూర్యాపేటలో కలసి ప్రచారం చేశాం.

క్యాబినెట్ మీటింగ్‌లో కాని, బయట గాని ఆయన చాల స్పష్టంగా మాట్లాడేవారు. వారు చాల సందర్భాల్లో చెప్పేవారు. మనం నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడాలని, పేదవాడికి న్యాయం చేయాలని, పేదరిక నిర్మూలన చేయాలని, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చెప్పేవారు. ఇవన్నీ చేయాలంటే, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉంటే తప్ప అది సాధ్యం కాదు. ఆ విధంగా ప్రజాప్రతినిధులు గ్రామాలకు పోకపోతే, అధికార యంత్రాంగం పోకపోతే, అభివృద్ధి ఏమి చేయగల్గుతాం? కాబట్టి ఈ విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని చెప్పి ప్రతి క్యాబినెట్ మీటింగ్‌లో చెప్పేవారు. ఏవయితే లా అండ్ ఆర్డర్ సమస్యలు ఉన్నాయో – అది ఎక్స్‌ట్రీమిస్టుల సమస్య కావచ్చు, ఫ్యాక్షన్ పాలిటిక్స్ కావచ్చు, కమ్యూనల్ పాలిటిక్స్ కావచ్చు, లేకపోతే రౌడీయిజం కావచ్చు – వాటన్నింటిని నిర్దాక్షిణ్యంగా అణచి వేయవలసిన అవసరం ఉందని, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను ప్రమోట్ చేయాలని వారు నిరంతరం చెప్పేవారని మీకు తెలియచేసుకొంటున్నాను. అదే విధంగా చాల సందర్భాల్లో క్యాబినెట్ మీటింగుల్లో మిగతా మంత్రులు మాట్లాడకపోతే, ఎందుకు భయపడతారు, మనం నమ్మిన సిద్ధాంతాలు అమలుపరచడంలో భయపడవలసిన అవసరం లేదని గట్టిగా మాట్లాడాలని మిగతా మినిస్టర్స్‌కు చెప్పిన సందర్భాలు నా జీవితంలో ఎప్పుడూ మరచిపోలేనని తెలియచేసుకొంటున్నాను. ఆ విధంగా రాష్ట్ర భద్రత కోసం ప్రాణానికి సహితం లెక్కపెట్టకుండా ముందుకు పోయారు. నాకు అనిపిస్తున్నది ఈ రాష్ట్రంలో శాంతిని పెంపొందించడం కోసం ఆయన బలయ్యారు. ఇది అరుదైన సంఘటన. ప్రతి ఒక్కరు ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా, ఫైనల్‌గా ఎప్పుడైనా లైఫ్ త్రెట్ ఉందంటే వెనుకంజ వేసేవారున్నారు. కాని మాధవరెడ్డి ఎప్పుడు కూడ భయపడకుండా ముందుకు పోయారు. ఆయన్ని హోమ్ మినిస్టర్ పదవి నుండి తప్పించి, పంచాయితీరాజ్ శాఖ అప్పగించినా, హోమ్ మినిస్టర్‌గా ఉండగా ఇచ్చిన సెక్యూరిటీనే పెట్టాం. అయినా ఈ సంఘటన జరిగింది. చాలా బాధాకరమైనది. నేను అక్కడి సంఘటనను ప్రత్యక్షంగా చూశాను. ఆ అప్రోచ్ రోడ్డును చూశాను. ఏ విధంగా అక్కడ మందుపాతరలు పెట్టి, మాధవరెడ్డిని హత్య చేసింది చూడటం జరిగింది.

9·10 ఉ·। ఈరోజు రాష్ట్రంలోని తీవ్రవాదులుకూడ ఆలోచించుకోవలసిన అవసరం ఉంది. మరి ఈ రాష్ట్రంలో మనం ఉన్నాం. ఈ విధంగా మంచి వ్యక్తులను పొట్టన బెట్టుకుంటూపోతే

మరి మనం ఏ విధంగా అభివృద్ధి చేసుకోగలుగుతాము? తుపాకులతో రాజ్యం తేవాలని తీవ్రవాదులు అంటున్నారు. ఇది సాధ్యమా అని నేనడుగుతున్నాను. ఎందుకు ఈ విధంగా ఆలోచిస్తున్నారు? ఈ రోజు పేదరిక నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలను చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ ప్రభుత్వమే కాదు ఏ ప్రభుత్వమైనా మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ఈ రోజు భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇటువంటి ప్రజాస్వామిక దేశంలో రెండు మూడు జిల్లాలలో ఈ విధంగా తీవ్రవాదులు లా అండ్ ఆర్డర్ సమస్యలను క్రియేట్ చేస్తూ, వెపన్స్‌తో, గన్స్‌తో రాజ్యం తెస్తామంటున్నారు. అంటే అది సాధ్యం కాదు. ప్రభుత్వపరంగా చాలాసార్లు అప్పీల్ చేశాం. ఇది వద్దు, మెయిన్ స్ట్రీమ్‌లోకి రండి, అశాంతిని క్రియేట్ చేయకండి అని. వెనుకబడిన ప్రాంతాలలో ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. ఇందువల్ల అడ్మినిస్ట్రేషన్‌కు పోలేకపోతున్నాము. ఎన్నోసార్లు పోలేకపోతున్నాము. ప్రజాప్రతినిధులు ఫ్రీగా తిరగలేకపోతున్నారు. అందువల్ల అభివృద్ధి కుంటుపడుతోంది. ఈ ఘాతుకాన్ని ఏ ఎక్స్‌ట్రీమిస్టులైతే చేశారో దానిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. గర్హిస్తున్నాను. ఇది మంచి పద్ధతి కాదని తెలియజేసుకుంటున్నాను.

ఈ రోజు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తున్నారు. ఓట్లు వేసి గెలిపిస్తున్నారు ఆ విధంగా ముందుకు పోవాలి గాని తుపాకులతో అభివృద్ధి వస్తుందని, రాజ్యం వస్తుందని అనుకోవడం భ్రమ. ఇది చాలా బాధాకరం. ఈ రోజు కొన్ని ప్రాంతాలలో మన రాష్ట్రంలో కొంతమంది పోలీసు ఆఫీసర్లను, మంచి రాజకీయ నాయకులను, ఎవరైతే వారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారో వారిని చంపేరు. ఆ విధంగా అనేక యిబ్బందులు కలుగు తున్నాయి. ఏది ఏమయినప్పటికీ సభాముఖంగా మనందరం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ రోజు మనం ఎందువల్ల శాంతిభద్రతలను, అభివృద్ధిని యివ్వలేకపోతున్నాం? మరి ఏ విధంగా మనం ముందుకు పోవాలో అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. బాధ్యతతో ఆలోచించి అందరమూ కలిసి పనిచేసి, ఈ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పవలసిన బాధ్యత మన మీద వుంది.

మాధవరెడ్డిగారు ఒక సుప్రీం శాక్రిఫైస్ చేశారు. జీవితానికి 'త్రెట్' ఉందని తెలిసి నప్పటికీ, నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడి, శాంతిని ప్రమోట్ చేయడంలో తన జీవితాన్ని పోగొట్టుకున్నారు. అలాంటి మంచి వ్యక్తిని తిరిగి తెచ్చుకోలేము. తిరిగి రాడు. కాని ఆయన ఏ స్ఫూర్తితో పని చేశారో, ఏ విలువల కొరకు పోరాడారో తెలుసుకుని వాటితో మనం ముందుకు పోవాలి. వారి మరణం ఎంతో బాధాకరమైన సంఘటన. మొన్నటి సమావేశాల్లో నా ప్రక్కన కూర్చుని, నవ్వుతూ మాట్లాడిన వ్యక్తి. ఎవరేమి అడిగినా, నవ్వుతూ, హుందాగా సమాధానం చెప్పే అటువంటి వ్యక్తిని కోల్పోవడం ఈ రాష్ట్రానికి, జిల్లాకు చాలా తీవ్రమైన లోటు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. కుమారుడు చదువుకుంటున్నారు. భార్య చాలా బాధపడే పరిస్థితి. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేసుకుంటున్నాను. మాధవరెడ్డిగారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఈ రోజు మనందరం ఆలోచించి, శాంతిభద్రతలను ఏ విధంగా ప్రమోట్ చేసుకుని ముందుకు పోవాలో ఆ విధంగా విలువలతో ముందుకు పోవాలని కోరుకుంటూ

బాధాకరమైన మనస్సుతో ఈ రోజు వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేసుకుంటూ, మాధవరెడ్డిగారికి నివాళులు అర్పిస్తున్నాను.

డా. వై. ఎస్. రాజశేఖరరెడ్డి:- అధ్యక్షా, మాధవరెడ్డిగారి అకాల మరణానికి మా కాంగ్రెస్ పార్టీ తరఫున మా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరుస్తున్నాను. 1985వ సంవత్సరం నుంచి 1989 వరకూ యిదే చట్ట సభలో, మరియు ఈ ఐదారు మాసాల కాలంలోను మాధవరెడ్డిగారితో సహచర్యం నాకుంది. ఆయన ఎప్పుడూ పది మందితో కలిసిపోయే స్వభావి. నిగర్వి. అటువంటి మాధవరెడ్డి నిజంగా నా కళ్ల ముందు మెదులుతున్నట్లు, తిరుగాడుతున్నట్లు అనిపిస్తోంది. పాపం రైతు కుటుంబం నుంచి వచ్చి, బిఎస్సీ చదువు మధ్యలో మానివేసి, సూరత్‌లో ఇంజనీరింగు మొదటి సంవత్సరం పూర్తి చేసి, తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌పూర్తి చేసిన మాధవరెడ్డి ఉద్యోగాల గురించి ఆలోచించకుండా తాను పుట్టిన గడ్డకు ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశంతో 'జై కిసాన్' అనే రైతు సేవా సంస్థను స్థాపించి, అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉండేవారు. యువకుడుగా 1981లో పంచాయతీబోర్డు సర్పంచిగా, కాంగ్రెసు పార్టీపైన సమితి ప్రెసిడెంటుగా ఎన్నికై 1985 నుంచి తెలుగుదేశం పార్టీతరఫున ప్రజా ప్రతినిధిగా చట్టసభలోకి వచ్చిన మాధవరెడ్డిని అకాల మృత్యువు బలి తీసుకుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. పంచాయితీ సర్పంచ్‌గా తన జీవితాన్ని ప్రారంభించిన మాధవరెడ్డి పంచాయతీ మంత్రిగా తన జీవితాన్ని పూర్తి చేశారు. ఎప్పుడూ తనకున్న బాధ్యతల నిర్వహణలో హోం మంత్రిగాగాని, వైద్యశాఖా మంత్రిగా గాని ప్రతి విషయంలో పది మందినీ కలుపుకుంటూ పోవాలని, అందరికీ అందుబాటులో ఉండాలని అనుకునే స్వభావి. స్వపక్షం వారినే కాక ప్రతి పక్షం వారిని కూడా మృదువుగా పలకరించి మాట్లాడే మనిషి ఆయన. అవే ఆయనను అందరకూ దగ్గరగా చేశాయి. అటువంటి మాధవరెడ్డిగారిని తీవ్రవాదులు హత్య చేయడం, మరి ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు తుపాకి గొట్టం ద్వారా స్వాతంత్ర్యాన్ని, లేకపోతే రాజ్యాన్ని తేవాలనే తీవ్రవాదుల ఆలోచనా విధానం ఈ ప్రజా స్వామ్యంలో ఎప్పుడూ కూడా ఎవరూ ఒప్పుకోని విషయం. వారి ఆలోచనా విధానం మారాలి. వారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలి. వారావిధంగా రావడానికి ప్రభుత్వంలో అధికారంలో ఉన్నవారు తగు విధమైన ఆలోచన చేయాలి. దానిని గురించి యిప్పుడు ఎక్కువగా మాట్లాడే సమయం కాదు. దానిని గురించి ఎక్కువ మాట్లాడకుండా, మాధవ రెడ్డిగారి హత్యను ఖండిస్తూ, అటువంటి ఆలోచనా విధానాన్ని తీవ్రవాదులు మార్చుకోవాలని కోరుతూ, మాధవరెడ్డిగారి హత్య పట్ల మా ప్రగాఢ సానుభూతిని, వారి కుటుంబ సభ్యులకు కుమార్తెలకు, కుమారునికి, బంధువులకు, మిత్రులకు భగవంతుడు వారు లేని లోటును లేకుండా చేయాలని కోరుతున్నాను.

శ్రీ కె. విద్యాధరరావు:- మేడమ్ స్పీకర్, ఈనాడు మాధవరెడ్డిగారు మన మధ్యలేరు మన మధ్య వారు లేకపోయినా, నా ప్రక్కనే ఆయన ఉన్నారన్న భావన కలుగుతోంది. ఎప్పుడూ ప్రజలను చిరునవ్వుతో ఆకట్టుకునే వ్యక్తికి యిటువంటి పరిస్థితులలో మరణం సంభవిస్తే, ఇంతకంటే దురదృష్టకరమైన సంఘటన మరొకటి ఉండదని మనవిచేస్తున్నాను.

దీనిని ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా, కులమతాల కతీతంగా తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను. సమయం ఆసన్నమయింది. సిద్ధాంతాలు ఏవైనప్పటికీ, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఏకతాటిపై కలిసికట్టుగా మనం పని చేయలేకపోతే రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? మాధవరెడ్డిగారి మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటని మనవిచేస్తున్నాను. ఎంతో సన్నిహితంగా ఉంటూ, అనేక సందర్భాలలో అనేక సలహాలిస్తూ ఎప్పుడూ చిరునవ్వుతో సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేసిన మనిషాయన. అదే విధంగా మా తెలుగుదేశం పార్టీకి ఈనాడు మాధవరెడ్డిగారు లేని లోటును భర్తీ చేయడం కష్టం. ఏ బాధ్యత అప్పగించినా ఆయన మరో ఆలోచన లేకుండా, పక్కవాడు వెనుకడుగు వేసినప్పటికీ, ఆయన మాత్రం పార్టీ ఆదేశాల గురించి కృషి చేసిన వ్యక్తి, కనీసం బంధుత్వం గాని, మరొకటి గాని ఆయన మనసులో దరి చేరనీయకుండా పార్టీకొరకు శ్రమించిన వ్యక్తి ఆయన.

9.20 ఉ. అదేవిధంగా ముఖ్యమంత్రిగారికి కూడా ఇది తీరనిలోటు అని మీకు మనవిచేస్తున్నాను. ఎందుకంటే నాకు తెలుసు. 1985 నుండి మేమంతా కలిసికట్టుగా ఏవిధంగా పని చేశామో, అందులో మాధవరెడ్డిగారు ముఖ్యమంత్రిగారితో ఎంతో సన్నిహితంగా కలిసిమెలిసి ప్రయాణాలుచేస్తూ ఒక టీమ్ స్పిరిట్‌తో పనిచేసిన-మనిషి-అటువంటి వ్యక్తి ఈనాడు-లేకపోవడం సామాన్యమైన విషయం కాదు. ఇది ముఖ్యమంత్రిగారికి తీరనిలోటు. వారు నిబ్బరంగా జీర్ణించుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తీరనిలోటు. ఎందుకంటే ఒక మంచి ప్రజాప్రతినిధిని కోల్పోవడం జరిగింది. ప్రతిపక్షనాయకులు రాజశేఖరరెడ్డిగారు చెప్పినట్లు పార్టీలతో సంబంధం లేకుండా పదిమందినీ కలుపుకొని వెళ్ళాలనే ఉద్దేశ్యంతో ఏ శాఖలో పనిచేసినా ఆ శాఖ సిబ్బందిలో విశ్వాసం కలిగేవిధంగా వ్యవహరిస్తూ, విశ్వాసంతో, ధైర్యంతో ముందుకువెళ్ళే నాయకుడు అని మనవిచేస్తున్నాను. ఈనాడు అటువంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం సాధారణమైన విషయం కాదని మనవిచేస్తున్నాను. ఆయన సాధారణ పౌరుడికి కూడా ఆదర్శవంతమైన వ్యక్తి. He is a shining example to every political worker.

ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఎటువంటి గాడ్‌ఫాదర్ లేకుండా స్వయంకృషితో ఆయన వ్యక్తిగతంగా ఇంజనీరింగ్ పట్టభద్రులయినా ఉద్యోగం కోసం ప్రాకులాడకుండా ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు రైతులకు సంబంధించిన చిన్న పరిశ్రమలాంటిది ప్రారంభించి ఆయన ఒక్కరే కాకుండా మిత్రులనుకూడా ఇన్‌వాల్వ్ చేసి పనిచేశారు. ఆయనతోపాటు పని చేసినవారు ఇప్పటికీ కూడా ఆ కార్యక్రమాలు చేస్తున్నారని మనవిచేస్తున్నాను. ఆ విదంగా జీవితం ప్రారంభించిన వ్యక్తి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడమే కాకుండా సమితి ప్రెసిడెంటయి అక్కడినుండి నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నిక కాబడి ప్రజాభిమానం పొంది, మంత్రివర్గంలో హోంశాఖ, ఆరోగ్యశాఖ, హోంశాఖ మరల పంచాయతీ శాఖమంత్రిగా చాలా సమర్థవంతంగా పదవులు నిర్వహించారు. రాజకీయాలలో గానీ, ఏ ఒక్క కార్యక్రమంలో గానీ క్రమశిక్షణ, కార్యదీక్ష వుంటే సామాన్యపౌరుడు కూడా ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చునే, ఎవరి సానుభూతి, అండదండలు అవసరం లేదని మాధవరెడ్డిగారి జీవితం నిర్వచిస్తుందని మనవిచేస్తున్నాను. He made supreme sacrifices.

మాధవరెడ్డిగారు దేనికి బలయ్యారని ప్రశ్నిస్తున్నాను. శాంతిభద్రతలు కాపాడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అవసరం అనే, ప్రతి పౌరుడు, ప్రతి మహిళ, ప్రతి యువకుడు స్వేచ్ఛగా తిరిగే అవకాశం కలిగించాలనే ఆలోచనతో శాంతిభద్రతల కోసం కృషిచేసినందుకు ఈనాడు ఆయన బలయ్యారు. తుపాకీగొట్టం ద్వారా విప్లవం తీసుకొని రావాలని ప్రయత్నం చేసే శక్తులు అది ఎంతవరకు సాధ్యం అవుతుందో ఆలోచించాలని మనవిచేస్తున్నాను. తుపాకీగొట్టం ద్వారా విప్లవం తీసుకొని రావడాన్ని బలపరిచే సంస్థలు కూడా ఆలోచన చేయాలని కోరుతున్నాను. పౌర హక్కులని చెప్పి తుపాకి ద్వారా రివల్యూషన్ తేవాలని ప్రయత్నం చేస్తున్నవారు దానిని బలపరుస్తున్నవారు, నామమాత్రంగా కూడా ఈనాడు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం, శాంతిభద్రతలను కాపాడడం కోసం మనందరికీ స్వేచ్ఛ ఇవ్వడం కోసం కృషిచేసిన వ్యక్తి కోసం ఆయన హత్యపట్ల ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దానిని గురించి ఈ సభ్యులు, గౌరవ రాజకీయపార్టీ నాయకులు, సహచర శాసనసభ్యులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. పౌరహక్కులు అనేవి ఏ కొంతమందికో మాత్రమే కాదు. ప్రతి మానవుడికి వుండాలనే వాస్తవం గుర్తించాలని పౌర హక్కుల సంస్థకు సంబంధించిన వ్యక్తులందరికీ మనవిచేస్తున్నాను. మాధవరెడ్డిగారి గురించి మీకందరికీ తెలుసు. వారు పదే పదే విప్లవకారులకు టెర్రరిస్టులకు, నక్సలైట్లకు పిలుపు ఇచ్చిన సందర్భం ఉంది. జనజీవన స్రవంతిలోకి రండి. మిమ్ముల్ని రిహాబిలిటేట్ చేస్తాము. తుపాకిగుళ్ల ద్వారా, విప్లవ కార్యక్రమాల ద్వారా రివల్యూషన్ సాధ్యం కాదని, అధికారం చేపట్టడం సాధ్యం కాదని పదే పదే చెప్పడం నేరమా అని ప్రశ్నిస్తున్నాను. ఈ రోజు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాయడానికి ప్రయత్నం జరిగినదానికి అడ్డుకొనే ప్రయత్నం చేసినందుకు he had to make supreme sacrifice. ఇటువంటి కార్యక్రమాన్ని మనమందరం కలిసి రాజకీయాలకు అతీతంగా మనమందరం ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొంతమంది ఇది సోషియో ఎకనామిక్ ప్రాబ్లం అనే లా అండ్ ఆర్డర్ సమస్య కాదని అంటున్నారు. ఆనాడు నక్సలిజం సోషియా ఎకనామిక్ సమస్యగా ప్రారంభించబడినా అప్పటికీ ఇప్పటికీ అందులో చోటు చేసుకొని పరిణామాలను చర్చించవలసిన అవసరం ఉంది. ఐడియాలజీ అప్పటికీ ఇప్పటికీ వచ్చిన తేడాలను గమనించ వలసిన అవసరం ఉంది. ఈనాడు సోషియో ఎకనామిక్ సమస్యగా భావించవలసి వస్తే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందే తరుణంలో అవి అభివృద్ధి చెందకుండా కార్యక్రమాలు జరగకుండా కాలడ్డం పెడుతున్నారు. మరి దేనిని సోషియో ఎకనామిక్ ప్రాబ్లంగా ఏ విధంగా ఎనలైజ్ చేస్తాము. మనమందరం కలసికట్టుగా పిలుపు ఇవ్వాలి. తుపాకిగొట్టం ద్వారా విప్లవం తీసుకొనిరావడం అసాధ్యం అనే జనజీవన స్రవంతిలో కలసి కట్టుగా ప్రయాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందనే, రాజ్యాంగాన్ని అనుసరించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కలిసికట్టుగా ప్రయాణం చేయకపోతే, శాంతిభద్రతలు లేకపోతే ఈ రాష్ట్రం వెనుకబడే వుంటుందని మనవిచేస్తున్నాను. ఎక్కడయితే ఫ్యాక్షనిజం ఉందో ఎక్కడయితే నక్సలిజం ఉందో, ఎక్కడయితే లా అండ్ ఆర్డర్ సమస్య వుందో ఆ ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. ఎన్ని విధాలుగా ప్రయత్నం చేసినా అభివృద్ధి లేకుండా వెనుకబడి వున్న వాస్తవాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. మాధవరెడ్డిగారి కుటుంబానికి గుర్తింపు, ఆయన ఆత్మకు శాంతి

చేకూరేవిధంగా, వారు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉండే విధంగా ముఖ్యమంత్రిగారు తీసుకొన్న నిర్ణయాలు అభినందనీయం.

ఇక చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డిగారి కుటుంబానికి గానీ, డ్రైవర్ నిరంజన్‌గారి కుటుంబానికి గానీ రక్షణ కల్పించే విషయంలో ముఖ్యమంత్రిగారు కొన్ని నిర్ణయాలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డిగారి గురించి కొంత చెప్పవలసి ఉంది. వారు చాలా పేరు ప్రతిష్ఠలు గడించిన వ్యక్తి. ఎంతో మంది సీనియర్లు ఆయన సెక్యూరిటీ ఆఫీసర్‌గా వుండాలని కోరుకొనే వ్యక్తి. ఎంతో నిక్కచ్చిగా కృషి చేసే వ్యక్తి అటువంటి సిన్సియర్ ఆఫీసర్లు ఉండరని అంతా చెప్పడం జరిగింది. ఆ రోజు నేను హోం మంత్రిగారు ఆయన భౌతికకయాన్ని చూడడానికి హాస్పిటల్‌కు వెళ్ళినపుడు ఆయన కుటుంబసభ్యులు రోదిస్తూ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వెళ్ళవద్దని ఎంత చెప్పినా కూడా నేను తప్పకుండా సెక్యూరిటీ ఆఫీసర్‌గానే వుంటాను అని చెప్పి చివరకు సెక్యూరిటీ ఆఫీసర్‌గానే ప్రాణత్యాగం చేయడం జరిగిందని చెప్పడం జరిగింది ఇక్కడ ఒక చిన్న విషయాన్ని గుర్తు చేయదలచుకొన్నాను. ఈనాడు దక్కన్ క్రానికల్ చూస్తుంటే ఒక చక్కటి సేయింగ్ ఇందులో చెప్పడం జరిగింది. అది చూచి గౌరవ సభ్యులకు చదివి వినిపించాలని వ్రాసుకొని రావడం జరిగింది. 'Life is lost, but the brightness is ever-lasting; the flower is no more, but the fragrance is eternal; the river ceased to flow, but the commitment is enduring.' ఈ విషయాన్ని మనమందరం గుర్తించాలని మనవి చేస్తూ, మరొకసారి, మంచివారినే ఈశ్వరుడు దగ్గరకు తీసుకొంటాడనిపిస్తుంది. వారి అటెండర్ రాములు చెప్పిన ఒక సంఘటన చెబుతున్నాను. ఆయన ఎప్పుడు యాదగిరి గుట్ట వెళ్ళినా అక్కడ పూజకు వెళ్ళే వ్యక్తి. ఆ రోజు కూడా ఆయన పేరు ఏదో పూజలో వుందని మిర్యాలగూడ నుండి యాదగిరి గుట్ట వచ్చి స్నానం చేసి కొత్తవస్త్రాలు కట్టుకొని భగవంతుడిని దర్శించుకొని అక్కడనుండి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. మంచివారిని త్వరగా వారిసేవలను మరొకరకంగా వినియోగించుకొనేందుకు ఆయన తీసుకొని వెళ్ళిపోతాడని భావించవలసి వున్నది. వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి, డ్రైవర్ నిరంజన్‌గార్ల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకొంటూ, వారి కుటుంబాలకు నా సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను

9.30 ఉ. శ్రీ ఎస్. ఇంద్రసేన్నా రెడ్డి (మలక్‌పేట):- మేడమ్ స్పీకర్, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఎలిమినేటి మాధవరెడ్డిగారి సంతాపతీర్మానాన్ని మా పార్టీ బలపరుస్తోంది వారికి మా యొక్క ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటున్నాము

మాధవరెడ్డిగారితో 1985 నుంచి పరిచయం వున్నా, చివరిసారిగా మొన్న జరిగిన మునిసిపల్ ఎన్నికల సందర్భంలో 10 రోజుల ముందు సూర్యాపేట, మిర్యాలగూడ క్యాంపైన్ పూర్తి చేసుకుని, రాత్రి 9.30 అయిన తరువాత బయలుదేరే ముందు చేకటి

పడింది కాబట్టి నేను మీ కారులో వస్తాను, నా కారు వెనకాల పాలో అవుతుందని అన్నాను అందుకు మాధవరెడ్డిగారు నేనే మీ కార్లో వస్తానని చెప్పి వారు నా కార్లో ఎక్కారు అక్కడ నుంచి రెండు గంటలు ప్రయాణం చేసాము చౌటుప్పల్ వెళ్ళేసరికి ముందు రెండు ఎస్కార్టు జీపులున్నాయి. ప్రక్కన ఒక ఇసుక లారీ రిపేర్ కోసమని ఆగి వుంది ఏమైందో తెలియదు కాని, ముందున్న ఎస్కార్ట్ జీపు డైరక్ట్‌గా ఇసుక మీదకు వెళ్ళింది దాని వెనుక వున్న రెండవ ఎస్కార్టు జీపు దానికి చిన్నగా తగిలింది దాని వెనుకాలే వున్న మా కారు దానిని గుద్దుకోవడం, బోనెట్ పెడిపోవడం జరిగింది కారులో డ్రైవర్ ప్రక్కనే వున్న మాధవరెడ్డిగారి కాలికి స్వల్పంగా గాయం అవడం జరిగింది ఆ తరువాత మాట్లాడుకుంటూ వచ్చాము

ఆ రోజు మాధవరెడ్డిగారికి నా కారులో యాక్సిడెంట్ అయిందే అని నేను మనసులో బాధపడ్డాను. కాని ఇప్పుడనిపిస్తుంది, ఆ రోజు వారికి ఇంకొంచం పెద్దగా దెబ్బతగిలి వుంటే హాస్పిటల్‌లో వుండేవారు, చనిపోయి వుండేవారు కాదని మనసులో బాదపడుతున్నాను విధి వ్రాత ఆ రకంగా వుంది. మాధవరెడ్డిగారు స్టూడెంట్ లైఫ్‌లో వున్నప్పటినుంచి పూర్ పీపుల్ గురించి ఆలోచించేవారు లెఫ్ట్ భావాలు వుండే వ్యక్తి ఆయన జీవితంలో రియల్లీ పూర్ పీపుల్‌కు ఏమి చేయాలని ఆలోచిస్తూ, ఆ రకంగా పనిచేస్తూ వచ్చారు వెనుకబడిన నల్గొండ జిల్లానుంచి, అందులోనూ ఇంకా వెనుకబడ్డ ఆలేరు, భువనగిరి ప్రాంతాలనుంచి వచ్చిన మాధవరెడ్డి నల్గొండ జిల్లాలో ఎం.ఎల్.ఏ అయినప్పటినుండి అంచెలంచెలుగా ఎదుగుతూ, జిల్లాను బాగుచేయాలనే పట్టుదలతో అనేక కార్యక్రమాలను తీసుకున్నారు ఈ రోజు తెలంగాణాలోనే ఒక నాయకుడిగా ఎదిగిన వ్యక్తి మాదవరెడ్డి వారు ఎప్పుడూ వెనుకబడ్డ ప్రాంతాల గురించి రిప్రజెంట్ చేస్తుండేవారు.

ఎస్.ఎల్.బి.సి. గురించి కాని, నల్గొండలో కలెక్టరేట్ గురించి కాని, మిగతా డెవలప్‌మెంట్ వర్క్స్ విషయంలో కాని, వారు చేసిన సేవలు మరపురానివి తెలంగాణా ప్రాంతానికి, నల్గొండజిల్లాకు తీరని నష్టం జరిగిందని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

మాధవరెడ్డిగారి మరణ వార్త విన్నపుడు ఎక్కడ జరిగిందని అడిగాను ఘటకేసర్‌లో జరిగిందని ఫోన్‌లో చెప్పారు ఘటకేసర్ అనగానే నా ప్రక్కన వున్న వారికి చెప్పాను, ఖచ్చితంగా ఇది బ్రిడ్జి మీద అయి వుంటుందని, ఎందుకంటే, వారం రోజుల క్రితం క్యాంపెయిన్‌కు వెళ్ళినపుడు గేటు మూసివేసి పై నుంచి ట్రాఫిక్ ఒదిలిపెట్టారు బ్రిడ్జి పూర్తి కాలేదు, రోడ్డు వెయ్యలేదు. కాని, గేటు మాత్రం మూసివేసారు ట్రాఫిక్‌ను బ్రిడ్జి మీదకు ఎందుకు పంపించవలసి వచ్చిందని అనుమానం కలుగుతోంది ఎవరూ కూడా రోడ్ సెటిల్‌మెంట్ కాకమునుపే ట్రాఫిక్‌ను పంపించరు ఇది కూడా కారణం అయి వుంటుంది

కాబట్టి ముఖ్యమంత్రిగారు ఒక విషయం ఆలోచించాలని కోరుతున్నాను ఈ కేసును విచారించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవలసిన ముఖ్యమైన అంశం – గేటు మూసివేయ వలసిన అవసరం ఏమొచ్చింది? రోడ్డు ఫార్మేషన్ పూర్తి కాక ముందే ట్రాఫిక్‌ను మట్టి రోడ్డు మీద వదిలి పెట్టవలసిన అవసరం ఏమొచ్చింది?

అదేవిధంగా, మాధవరెడ్డిగారిని మట్టుపెట్టిన వారు తీవ్ర వాదులు వారు ఈ రాష్ట్రంలో అనేకమందిని, వారికి వ్యతిరేకంగా వున్నవారిని చంపడం ఒక పద్ధతిగా పెట్టుకుని చంపేస్తున్నారు. నల్గొండ జిల్లాలో మా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మైసయ్యగారిని మా పార్టీ సింపతైజర్స్, నాయకులు సామా జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, రామన్న, గోపన్న, శ్రీనివాస్ – ఇలా 40, 50 మంది మా పార్టీకి సంబంధించిన వారిని వారు చంపివేసారు. శ్రీపాదరావుగారిని చంపేసారు, పురుషోత్తమరావుగారిని, హయగ్రీవాచారిగారిని చంపేసారు. ఇంతమందిని చంపి వారు ఏమి సాధించారని అడుగుతున్నాను ప్రపంచం మొత్తం మీద ఉగ్రవాదాన్ని పాటిస్తున్న, ప్రోత్సహిస్తున్న ఏ సంస్థలూ కూడా సక్సెస్ కాలేదు. మన దగ్గర కూడా 25 సంవత్సరాలలో తాము సాధిస్తామని చెప్పిన నక్సల్‌బరి మూవ్‌మెంట్, ఇన్ని సంవత్సరాలు అయినా ఎంత ముందుకు వెళ్లారో వారు ఆలోచించు కోవాలని కోరుతున్నాను.

అదేవిధంగా వారితో కలసి పనిచేసిన వారు కూడా, ఇది లాభం లేదని చెప్పి, తిరిగి జనజీవన స్రవంతిలో కలసిపోయి, ప్రజాస్వామ్యమే సరియైన పద్ధతని చెప్పి అనేకమంది సరెండర్ అయినవాళ్లు కూడా వున్నారు. మరి వారు ఎందుకు బయటకు వస్తున్నారు? సిద్ధాంతం మీద విశ్వాసం లేకా? లేక వారు చెబుతున్నది కరెక్టు కాదనా? మిగిలినవారు కూడా దీనిని ఆలోచించాలని కోరుతున్నాను. ఈ రోజు వారిని సమర్థిస్తున్న బుద్ధి జీవులు కొందరు బయటకు వచ్చి 'చీకటి కోణాలు' అనే పుస్తకాన్ని వ్రాసి, వారు చేస్తున్న పనులన్నిటినీ కూడా స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ రోజు వెనుకబడిన వారి కోసం, బలహీన వర్గాలవారి కోసం మేము ఈ విధంగా చేస్తున్నామని వారు అంటున్నారు కాని, వెనుకబడిన వాళ్లను కూడా చంపేసారే? హరిజన, గిరిజనులను కాళ్లూ చేతులూ నరికి చంపేసారే? వారి శవాలను వారి భార్యాపిల్లలకు, తల్లితండ్రులకు ఇవ్వాలని అర్గ్యూ చేస్తున్నా, శవాలు భార్యా పిల్లలకు దొరకకుండా మూట కట్టి, బావులలోనూ, చెరువులలోనూ వేసిన సందర్భాలు వున్నాయి.

కాబట్టి జీవితం అనేది అందరికీ ఒకటే వుంటుంది. అది వారికైనా, ఇతరులకైనా సరే. నా రిక్వెస్టు ఏమిటంటే, ఆ సిద్ధాంతాన్ని నమ్మినవారు ఇప్పటికైనా ఆలోచన చేసి, ఇది సరియైనది కాదు, ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఒకటే సరియైనదని నమ్మినవారు, తమ సిద్ధాంతాలను వారికి చెప్పి, తుపాకి గొట్టం సిద్ధాంతం సరియైంది కాదని చెప్పి, వారిని జనజీవన స్రవంతిలో కలవవలసిందిగా చెప్పి, ఆ రకంగా ప్రజలందరినీ కూడగట్టి కార్యక్రమాన్ని తీసుకోవలసిందిగా కోరుకుంటున్నాను.

మాధవరెడ్డిగారికి సెక్యూరిటీ ఆఫీసర్‌గా వున్న వారికి, మాధవరెడ్డిగారి డ్రైవరుకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబీకులకు ధైర్యాన్ని కలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

9.40 ఉ. శ్రీ ఇ. దయాకర్‌రావు (వరదన్నపేట):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు శ్రీ మాధవ రెడ్డిగారి సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన విషయంపై మాట్లాడడం బాధాకరంగా వున్నది. మాధవరెడ్డిగారు వారానికి ఒకసారి మా వరంగల్ జిల్లాకు ఫోన్‌చేసి దయాకర్ జాగ్రత్త, ఎం.ఎల్.ఏ.లు ఎట్లాగున్నారు, కార్యకర్తలు ఎట్లాగున్నారు అనేది మమ్మలను అడిగితెలుసుకొనేవారు. మమ్మలను ఇప్పుడు ఎవరు అడిగి తెలుసుకొంటారు అనే బాధ మాకు ఉన్నది. ఏ చిన్న సంఘటన జరిగినా వారికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా మా వరంగల్ జిల్లాకు వచ్చేవారు. ఏ కార్యకర్త చనిపోయినా, ఆ కార్యకర్త గురించి అడిగి ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకొనిపోయి తగిన సాయంచేసే మా మాదన్న పోవడం మా జిల్లాకు తీరని లోటు, రాష్ట్రానికి తీరని లోటు. ముఖ్యమంత్రిగారు ఆందోళన చెందుతూ వుంటే మేము కూడా చాలా బాధపడ్డాము. ముఖ్యమంత్రిగారు కన్నీళ్లు పెట్టుకొన్న సందర్భాలు నేను ఎన్నడూ చూడలేదు. కాని మాధవరెడ్డిగారు చనిపోయినపుడు ముఖ్య మంత్రిగారి బాధ చూసిన తరువాత మా అందరికి కూడా ఇంకా ఏమౌతుందో అని భయం ఉన్నదని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను. నక్సలైట్లు మాధవరెడ్డిగారిని పురుషోత్తమరావును, శ్రీపాదరావును చంపారు అంటే మంచి వాళ్లను ప్రజలతో సంబంధం ఉన్న వాళ్లను చంపడం జరుగుతోంది. ప్రజలతోటి ఎవరు సంబంధాలు పెట్టుకొన్నా రేపు వాళ్లగతి ఏమి అవుతుందోనని భయం కూడా ఉన్నది. చెడుచేసిన వాళ్లకు మంచి రోజులు వస్తాయా అనేది ఆలోచన కూడా రావడం జరుగుతావున్నది. మేము చదువుకొనేటప్పుడు మా వరంగల్ జిల్లాలో చెడు చేసిన వాళ్లను చంపేది. రౌడీజం, గూండాయిజం చేసిన వాళ్లను టార్గెటు పెట్టి చంపేది. ఈ రోజు ప్రజల దగ్గర ఎవరు మంచి పేరు సంపాదించుకొన్నారో వాళ్లను టార్గెటు పెట్టి చంపడం, ఇది ఎంతవరకు సబబు అనేది కూడా ఆలోచించాలి. ఇవాళ అందరి లోపల భయం ఉన్నది. ఎవరూ కూడా బయట చెప్పలేకపోతున్నారు. బయట గట్టిగా అంటే నా పేరు టార్గెట్ లిస్టులో ఎక్కుతుందని బయం అందరికి ఉన్నది. ఎంత దూరం పోతుందో, ఎక్కడికి పోతుందో అనేది ప్రతిఒక్కరు ఆలోచించాలి అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. రేపు ఎవరు ఎక్కడ ఉంటారో అనేది నమ్మకం లేదు. ఎవరిని చంపరు అనేది కూడా నమ్మకం లేదు. కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ అన్ని పార్టీలు దయచేసి అందరు కూడా స్టేటుమెంటు ఇచ్చి ఎదుర్కొనే పరిస్థితి ఉండాలనేది ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకొని అన్ని రాజకీయ పార్టీలతోటి సంతాపసభ పెట్టారు. అది అన్ని జిల్లాలోను, మండలాలలోను జరగాలి, అన్ని రాజకీయ పార్టీల స్పందన తెలపాలి, అట్లా తెలిపినప్పుడు ఎవరెవరిని చంపాలి తేల్చుకొనే పరిస్థితి ఉండదు. ఎవరు బయట పడితే వాళ్లు టార్గెటు అవుతామనే బయం ఈవాళ ఉన్నదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఐపిఎస్ ఆఫీసర్లో మంచి ఆఫీసర్లు ఉన్నారు, కాని చెడువాళ్లను ఎవరూ చంపలేరు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేటందుకు,

కాపాడేందుకు, వాళ్ళ చేసిన తప్పులను దూరం కొట్టినందుకు మంచి, మంచి పోలీసు ఆఫీసర్లను చంపడం జరుగుతావున్నది, ఎంత దూరం పోతుందో, ఎక్కడికి పోతుందో తెలియకుండా ఉన్నది. వారు తల్చుకొంటే ఎవరిన్నైనా చంపుతామనేది మాధవరెడ్డిగారి హత్యతో తేలిపోయిందని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. దీనిని ఏకకంఠంతో ఖండించ వలసిన బాధ్యత అందరి మీద ఉన్నదని అన్ని రాజకీయపార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ చర్చ ప్రతి జిల్లా, ప్రతి మండలం నుంచి రావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. శ్రీ మాదవరెడ్డిగారు ఎవరికి చెడుచేసినట్లు నాకు ఇంతవరకు తెలియదు. ఏ కార్యకర్త బాధపడ్డా రాష్ట్రంలో ఎవరు బాధపడ్డా కూడా తను బాధపడట్టే ఫీలు అయ్యేవారు. మేము ముఖ్యమంత్రిగారికి చెప్పుకోలేని పరిస్థితులు వుంటే మాధవరెడ్డిగారు చొరవ తీసుకొని కార్యకర్తలు నక్సలైట్సుతోటి బలిఅయినారు ఏదన్నా సహాయం చేయాలని చెప్పేవారు. రాష్ట్రంలో ఎవరికి ఇబ్బంది అయినాకూడా తన మీదనే వేసుకొనే మాదన్న పోవడం మాకు పెద్ద లోటుగా మేము భావిస్తున్నాము. రాష్ట్రంలో ఏ కార్యక్రమం చేపట్టినా, మహానాడు పార్టీపరంగా కాని, ప్రభుత్వానికి ఏ ఇబ్బంది వచ్చినా కూడా తన మీదనే వేసుకొని పనిచేసే వారు. రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సంపాదించాలని అతి ఉత్సాహంగా పనిచేసే మాదన్న పోవడం చాలా విచారించతగ్గ విషయం అని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. ముఖ్య మంత్రిగారికి, పెద్దలు అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను, మా భవిష్యత్తు ఎట్లా అనేది కూడా మాకు అనుమానంగానే ఉన్నది. మా తెలంగాణా జిల్లాల్లో ఎం.ఎల్.ఏ.ల పరిస్థితి కూడా గుటి, గుటిగా ఉన్నది. మేము వరంగల్ నుంచి హైదారాబాదు వస్తావుంటే ప్రతి కల్వర్టు దగ్గర ఊపిరి పీల్చుకొనే పరిస్థితి ఉన్నది. నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేదు. నేవు తిరిగితే చచ్చిపోతావని పోలీసు ఆఫీసర్లు అంటున్నారు. మేము ప్రజలతో సంబంధాలు పెట్టుకొంటే ఒక తీరుగా ఉన్నది, సంబంధాలు పెట్టుకొకపోతే ఒక తీరుగా వున్నది, మరి ఏమి చేయాలి? దయచేసి దీనిలో రాజకీయాలకు తావు ఇవ్వవద్దు అని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను. తప్పుఒప్పులు జరిగినా కూడా రాజకీయంగా కాకుండా నక్సలైట్సు విషయంలో అందరూకూడా తీవ్రంగా ఖండించాలి అని చెప్పి నేను మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మాధవరెడ్డిగారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఇంతటితో ముగిస్తున్నాను.

శ్రీ టి. దేవేందర్‌గౌడ్:- అధ్యక్షా, ఈ రోజు ముఖ్యమంత్రిగారు ఈ యొక్క సంతాప తీర్మానం ప్రవేశపెట్టవలసినటువంటి, ఇటువంటి దురదృష్టకరమైనటువంటి, రోజు వస్తుందని నేను ఎప్పుడు కూడా ఊహించలేదు. దానిని నేను బలపరుస్తూ మాట్లాడుతూ వుంటే నాకు నిజంగా ఎంతో బాధగా వున్నదని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మేము ఇద్దరం ఒకే సీట్లో కూర్చొనే వాళ్ళం. శాసనసభలోనే గత 5 సంవత్సరాల నుంచి ప్రక్క ప్రక్కనే వుండి ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా వుండేటటువంటి మనిషి ఎటువంటి విషయాన్ని అయినా నిర్మొహమాటంగా మాట్లాడేటటువంటి మనిషి ఎంత స్నేహపూర్వకంగా, ఎలాంటి కల్మషంలేనటువంటి మనిషి ఈ రోజు మన మధ్య లేకపోవడం నిజంగా ఎంతో బాధ వేస్తుందని మీకు తెలియచేస్తున్నాను. శాసనసభలో చర్చ జరుగుతావుంటే మధ్యాహ్నం

కాగానే ముందు నన్ను భోజనం చేయమని చెప్పేవారు, వారు భోజనం చేశావా అని అడిగే వారు. మనం ఉన్న నలుగురిలో మొదట బెంచిలో లేకపోతే బాగుండదు ముందు నీవు భోజనం చేసి రావో, తరువాత నేను భోజనం చేసి వస్తాను అని చెప్పేవారు, ఆ విధంగా చెబుతూ వుండేటటువంటి వ్యక్తి చాలా ఆప్యాయితతో, ఎంతో ప్రేమతో ఉండే ఇలాంటి
9.50 మిత్రున్ని నేను కోల్పోయాను. అధ్యక్షా, మొదటినుండి శాసనసభలోను, ప్రభుత్వం
ఉ. లోనూ కాకుండా ప్రజాజీవితంలో కూడా ప్రజలకు సన్నిహితంగా, సామాన్యులకు సన్నిహితంగా ఉండాలని బాగా తాపత్రయపడే వ్యక్తి. మేమిద్దరం పక్కపక్క ఇండ్లలోనే ఉండేవారము. మన ఇద్దరి మూలంగా ఈ ప్రాంతమంతా డిస్టర్బ్ అవుతుందని ఎప్పుడూ అనేవారు. ప్రతిరోజూ పొద్దున్నే నా దగ్గరకు, ఆయన దగ్గరకు ఎంతోమంది వ్యక్తులు వచ్చేవారు. ఆ వీధి అంతా ఎప్పుడూ సందడిగా ఉండేది. మన మూలంగా వీధి వారందరూ ఇబ్బందులుపడుతున్నారు అని వారు అప్పుడప్పుడు బాధపడుతుండేవారు. తను లేనపుడు ఆ జనమంతా నా వద్దకు వచ్చేవారు. నేను లేనప్పుడు నా కోసం వచ్చిన జనం అంతా తన వద్దకు వెళ్లి ఫోన్ చెపించుకోవటమో, అవసరమైన పని చెపించుకోవటమో చేసేవారు. మా నియోజకవర్గాలు పక్కపక్కన ఉండటం కూడా ఇందుకొక కారణం. మేమిద్దరం ఆ విధమైన అవినాభావ సంబంధంతో మెలిగేవారమని మీ అందరకు తెలుసు. ప్రజా జీవితంలో నిజమైన ప్రజా ప్రతినిధి వారు. ఎలాంటి సంఘటన జరిగినా, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, తోటి కార్యకర్తలకుగాని మరెవ్వరికైనాగాని ఎలాంటి సమస్య వచ్చినా తాను ఏ విధంగా పరిష్కారం చేయాలని తహతహలాడే వ్యక్తి ఆయన. ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి, ఆర్థికంగా ఎదిగిపోయిన కుటుంబం కాదు, నిజజీవితంలో అనేక ఇబ్బందులుపడ్డ వ్యక్తి. చాలా కష్టపడి ఈ రోజు ఒక స్థాయికి వచ్చాడు, మంత్రిగా కూడా వచ్చాడు, మా పార్టీలలో కూడా ప్రముఖుడుగా ఉన్నాడు. మా పార్టీ కార్యకర్తలు గాని, ముఖ్యమంత్రిగారుగాని ముందు ఈ పని కావాలంటే ఎన్నడూ చేయలేననిగాని, నావల్ల కాదని గాని చెప్పేవారు కాదు. ఇంకా రెండు పనులు యాడ్ చేసుకుని, అవన్నీ తలమీద వేసుకుని పూర్తిచేసేవారు. పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి. ఆ విధంగా ఉన్న వ్యక్తి ఈనాడు మన మధ్యలో లేకపోవడం మనందరికీ తీరని లోటు. మనం చూస్తూనే ఉన్నాము, ప్రజాస్వామ్యం సామాన్యుని నుండి మొదలుకుని ప్రతి ఒక్కరికీ ఒక అవకాశం దానితోపాటు బాధ్యతలను ఇచ్చింది. ఆ విధమైన ఒక బాధ్యతను వీరు చేపట్టారు. ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నపుడు అనేక రకాలైన ఇబ్బందులు వస్తాయి. ఈనాడు ప్రజాస్వామ్యంలో మనకు ఎంతో స్వేచ్ఛ ఉంది, ఫ్రీ ప్రెస్ భారతదేశంలో ఉంది, చట్టసభలు ఉన్నాయి, ఆ విధంగా అనేక విధానాలు మన అభిప్రాయాన్ని వెలిబుచ్చటానికి ఉన్నాయి. అందరూ తమ తమ అభిప్రాయాలను నిర్భయంగా చెప్పుకోవటానికి అవకాశం ఉంది. ప్రజలందరూ రాజ్యాంగం అటువంటి హక్కులను ప్రసాదించింది. మేము నడుస్తున్న బాటే కరెక్టు బాట, ఆ బాటలోకి అందరూ రావాల్సిందే, ఎవరు రాకపోతే వారిని చంపేస్తాము, మా దారి నుండి తొలగిస్తామని కొంతమంది వ్యక్తులు మూఢ నమ్మకంతో ప్రపంచంలో ఎక్కడా సాధ్యంకాని సిద్ధాంతాన్ని ముంగిట వేసుకుని వారు బాధపడుతూ కోట్లాదిమంది ప్రజానీకాన్ని బాధపెడుతూ సమస్యలు సృష్టిస్తున్నారు. దానిని మనందరం తీవ్రంగా ఎదుర్కోవాలి. రాజకీయ పార్టీలన్నీ ఒకసారి ఆలోచన చేయాలి. ఇది ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య

కాదు. మాధవరెడ్డిగారికి తీవ్రవాదులతో సంబంధం ఏముంది? ఆయన రాజకీయాలలోకి రాకపోతే, మంత్రికాకపోతే ఈ విధంగా జరిగి ఉండేదే కాదు. ఒక బాధ్యతను నిర్వర్తించ టానికి ముందుకెళ్ళారు. రాజ్యాంగపరమైన ఒక బాధ్యతను ఆయనకు అప్పచెప్పినప్పుడు దానిని నిర్వర్తించటానికి ఆయన ముందుకెళ్ళారు. నొప్పి తగిలిన వ్యక్తులు అడ్డుతొలగించు కోవటానికి వేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదు. రాజకీయ పార్టీలన్నీ ఆలోచన చేయాలి కొన్ని సంస్థలు తుపాకీ గొట్టంద్వారానే అధికారంలోకి రావటం సాధ్యమని అనుకుంటున్నాయి అది పొరపాటని, అది సాధ్యంకాదని, వారందరూ జన జీవన స్రవంతిలోకి గావాలని తెలియ చెప్పాలి. ఈ విధమైన సిద్ధాంతం విజయవంతమైన దాఖలాలు ప్రపంచంలో ఏ దేశంలో కూడా లేదు. ఏనాడో ఒకనాడు వారందరూ లొంగిపోవడం జన జీవన స్రవంతిలో వారు కలిసిపోవడం తప్ప మరొక మార్గం లేదనే విషయాన్ని రాజకీయ పార్టీలన్నీ ఒకే కంఠంతో నొక్కిచెప్పాలి. ఇక్కడ రాజకీయాలకు తావుండకూడదు. ఎవరైతే ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్నారో వారందరూ నిష్పక్షికంగా, నిర్మొహమాటంగా చెప్పాలని తెలియజేస్తున్నాను ఈ సమస్యపైన ఇదే చట్ట సభలో రాష్ట్ర ప్రజాప్రతినిధులందరూ ఆలోచనచేయాలి. దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనాలి. పొరపాటేదైనా జరిగితే సరిదిద్దుకోవాలి తప్ప ఈ విధమైన పద్ధతులు అవలంభించటం మంచిదికాదని రాజకీయపార్టీలన్నీ ఆలోచన చేయాలి. ఇది ఒక ప్రభుత్వానికి, వ్యక్తికి, అధికారికి, పోలీసుకు నక్సలైట్‌కు సంబంధించిన సమస్య కాకూడదని మీ అందరకూ తెలియచేస్తున్నాను. ఆ తీరులో అందరూ ఆలోచన చేయాలి. నిరంజన్, రాంభూపాల్‌రెడ్డిలు బెస్ట్ ఆఫీసర్స్, వీరద్దరినీ కోల్పోయాము. రాంభూపాల్‌రెడ్డి మంత్రిగారి రక్షణపట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారు. డ్రైవర్ కూడా మా డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వ్యక్తే. వారు కూడా సామాన్య కుటుంబంనుండి వచ్చిన వ్యక్తులే. ఈనాడు ఒక చక్కని మిత్రున్ని, మా అందరికీ సన్నిహితున్ని, మా కుటుంబసభ్యున్ని కోల్పోవటం మాకు తీవ్ర బాధను కలుగచేస్తుంది. ఆ కుటుంబాన్ని చూస్తుంటే, పిల్లల్ని చూస్తుంటే, కుటుంబ సభ్యుల్ని చూస్తుంటే చాలా బాధస్తుంది. ఆ కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

شری اسدالدین اویسی :- محترم اسپیکر صاحب آج تمام لوگ مادھو ریڈی صاحب کے انتقال پر تعزیت کیلئے جمع ہوئے ہیں۔ وہ ایک مثالی سیاستدان بنے تھے۔ مجھے یہ کہنا پڑتا ہے کہ مادھو ریڈی صاحب نے اپنی محنت کے بل بوتے پر اپنی قابلیت کے بل بوتے پر اپنے کردار کے بل بوتے پر نچلی سطح سے سرپنچ منتخب ہو کر اپنی سیاسی زندگی کا آغاز کئے تھے۔ وہ عثمانیہ یونیورسٹی سے بی ای کی ڈگری حاصل کئے تھے۔ جس وقت محترم این ٹی راما راؤ صاحب تلگو دیشم پارٹی قائم کئے تھے اسوقت انھوں نے تلگو دیشم پارٹی میں شامل ہوئے وہ ایم ایل اے بھی منتخب ہوئے۔ محترم اسپیکر صاحب مادھو ریڈی صاحب کا مجھے ہمیشہ بھرپور تعاون رہا جب میں پہلی مرتبہ ایم ایل اے منتخب ہو کر آیا تھا وہ ہمیشہ بار بار مجھے بلا کر سمجھاتے تھے کہ ان مسئلوں پر آپ ایسا بات کرنا چاہیئے وہ ہمیشہ میری ہمت افزائی کرتے تھے۔ آج اس ایوان میں اب مسٹر ودیا دھر راؤ صاحب جہاں بیٹھے ہیں وہ اب مسکراتا ہوا چہرہ نظر نہیں آئیگا جب وہ وزیر صحت و طبابت تھے

میں عثمانیہ ہاسپٹل اور دوسرے گورنمنٹ ہاسپٹل کے تعلق سے نمائندگی کرتا تھا وہ مثبت انداز میں کام کرتے تھے۔ ان کے انتقال سے نہ صرف سب کو نقصان ہوا۔ میں سمجھتا ہوں کہ تلگودیشم پارٹی کو بہت بڑا نقصان ہوا۔ تلگودیشم پارٹی کو بہت بڑا نقصان ہوا بلکہ اس سے زیادہ تلنگانہ علاقہ کو ایک اچھے لیڈر سے محروم ہونا پڑا۔ مجھے جہاں تک معلوم ہے انکے انتقال سے شخصی طور پر چندرا بابو نائیڈو صاحب کو نقصان ہوا کیونکہ وہ ایک اچھے رفیق اور وفادار ساتھی تھے۔ انکو اپنی جماعت سے بہت محبت تھی۔ میں عملی طور پر انکو اسوقت دیکھا جب ۱۹۹۵ء میں چندرا بابو نائیڈو صاحب چیف منسٹر بنے۔ میں کسی وجوہات کی بناء پر مشیرآباد جیل میں تھا۔ میں اسوقت ہماری جماعت کا واحد رکن تھا۔ وہاں پر اپنے لوگوں کو بھیج کر مجھے کہلواتے تھے کہ اپنے والد صاحب سے بات کریں اور آپکی پارٹی کی تائید چندرا بابو نائیڈو صاحب کو دیں۔ جب ۱۹۹۶ء میں پارلیمنٹ کے الیکشن ہوئے اسکے بعد ۱۹۹۸ء میں پارلیمنٹ کے الیکشن ہوئے۔ ۱۹۹۶ء میں مسٹر دھرم کشن راؤ اور ۱۹۹۸ء میں مسٹر سدھاکر ریڈی صاحب ضلع نلگنڈہ سے الیکشن لڑ رہے تھے اسوقت مادھوا ریڈی صاحب انکے الیکشنوں میں بہت بڑھ چڑھ کر حصہ لے رہے تھے۔ انھیں جہاں کہیں بھی کمزوری نظر آئی مجھکو کہتے کہ نلگنڈہ کے آپکے پارٹی کے صدر مسٹر احمد کلیم صاحب کو کہیں ہماری پارٹی کی تائید کریں۔ محترم اسپیکر صاحب میں یہاں پر کوئی سیاسی تقریر نہیں کرونگا۔ آپ کے ذریعہ ارباب مجاز سے گذارش ہے کہ مادھوا ریڈی صاحب کی قربانی کو رائیگاں نہ جانے دیں۔ اس تعلق سے سوچئیے بندوق اور طاقت کے بل بوتے پر اینٹ کا جواب پتھر سے نہ دیں اس سے مسئلہ حل نہیں ہوتا خون خرابہ قتل و غارتگیری کو روکا جائے۔ ہم بھی اسکے قائل نہیں۔ ایسے واقعات سے کئی عورتیں بیوہ ہوگئی ہیں اور کئی معصوم بچے یتیم ہوگئے ہیں۔ سوؤں قتل ہوئے ہیں اس تعلق سے سوچنا چاہئیے۔ کوئی ایک اچھا لائحہ عمل تیار کریں ضرور ہم اسکی تائید کریں گے۔ میں یہاں پر کوئی سیاسی تقریر کرنا نہیں چاہتا۔ انشاء اللہ جب ۳ اپریل کو لا اینڈ آرڈر کے مسئلہ پر بحث ہوگی اسوقت میں تفصیلی روشنی ڈالونگا۔ میں آخر میں مادھوا ریڈی صاحب کی بیوہ انکی بیٹیوں اور بیٹوں اور انکے ساتھ کام کرنیوالے لوگوں کے غم میں میں اور ہماری پارٹی برابر کا شریک ہے۔

---

10.00 ఉ. శ్రీ డి. నాగేందర్ (ఆసిఫ్‌నగర్):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన మాధవరెడ్డిగారి సంతాపతీర్మానాన్ని బలపరుస్తూ, మాధవరెడ్డిగారితో నేను కేవలం శాసనసభ్యునిగా ఎన్నికైనపుడే గాకుండా, గతంలో అంటే 1989లో నేను మొట్టమొదటిసారిగా శాసనసభకు పోటీ చేసినపుడు వారి యొక్క అనుచరుడు. ప్రస్తుత నల్గొండ పార్లమెంటు సభ్యులైన గుత్తా సుఖేందర్‌రెడ్డి ద్వారా నాకు న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాధవరెడ్డిగారితో పరిచయమేర్పడడం జరిగింది. గుత్తా సుఖేందర్ రెడ్డి, నేను ఒకే కళాశాలలో చదువుతున్నపుడు, ఆయన నాకు సీనియర్. ఆ విధంగా సుఖేందర్‌రెడ్డి ద్వారా మాధవరెడ్డిగారితో పరిచయమేర్పడింది. మాధవరెడ్డిగారి దృష్టికి ఎప్పుడైనా ఏ సమస్య అయినా తీసుకొచ్చినప్పుడుగాని, నేను 1994లో మొట్టమొదటిసారిగా శాసనసభకు ఎన్నికైనప్పుడు, మేము యిక్కడ అపోజిషన్‌లో ఉండి వారిని రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా, వారు నవ్వుతూ మాకు

సమాధానం యిచ్చిన సందర్భాలున్నాయి. మరి ఈనాడు వారు ఈ సభలో లేకపోవడం, వారి యొక్క అకాల మరణం వల్ల కేవలం మన శాసనసభ దు:ఖసాగరంలో మునిగిపోవడమే గాకుండా, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని రాజకీయపార్టీలు వారి వారి పార్టీలకు అతీతంగా ఈ సంఘటనను ఖండించిన సందర్భాలున్నాయి. నేను ఎక్కువ సమయం తీసుకోకుండా ముగిస్తాను.

మన ముఖ్యమంత్రిగారు మొన్న లలిత కళాతోరణంలో మాధవరెడ్డిగారి మృతి పట్ల సంతాపాన్ని తెలియజేయడానికి అన్ని పార్టీలను పిలిపించి ఒక కండోలెన్స్ మీటింగు పెట్టారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ ఒక విషయం చెప్పారు. నేను ఈ రోజు ఒక సహచరున్ని కాదు, నా యొక్క సోదరున్ని, నా యొక్క కుడి భుజాన్ని పోగొట్టుకున్నానని చెప్పినపుడు నాకు చాలా బాధ కలిగింది. మాధవరెడ్డిగారు అంత్యక్రియలను చూడడానికి మేము వారింటికి వెళ్లినప్పుడు, కుటుంబ సభ్యులు బెంగుళూరు నుంచి రావలసిన మాధవరెడ్డిగారి కూతురి గురించి వెయిట్ చేస్తుంటే, కాసేపు తర్వాత బెంగుళూరు నుంచి ఆ అమ్మాయి రావడం, ఆ సందర్భంలో కుటుంబ సభ్యులు ఆ అమ్మాయికి తమ ఆవేదనను వ్యక్తం చేస్తుంటే, హృదయవిదారకమైన ఆ పరిస్థితిని చూడలేక బాధతో బయటకు వచ్చాము. ఏదేమైనప్పటికీ, మాధవరెడ్డిగారి మరణంపట్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున మా నాయకులు రాజశేఖర్‌రెడ్డిగారు, మేమందరమూ బలపరుస్తూ ఈ సంఘటనకు దారితీసిన పరిస్థితులను ఖండించాం. అయితే ఈ సందర్భంగా నేను ముఖ్యమంత్రిగారికి ఒక విషయాన్ని మనవి చేస్తున్నాను. మీరు ధైర్యంగా ముందుకెళ్లండి, ఎలాంటి సందర్భమొచ్చినా కాంగ్రెస్ పార్టీ తరఫున మీకు మా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియజేస్తున్నాను.

మాధవరెడ్డిగారి మృతిపట్ల నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ వారి కుటుంబసభ్యులకు ఆయురారోగ్యాలు యివ్వాలని, వారి కుమారుడు, కూతుళ్లకు ధైర్యం యివ్వాలని, అదే సమయంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన రాంభూపాల్‌రెడ్డి, నిరంజన్‌ల మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు యివ్వాలని ఆ భగవంతున్ని కోరుతున్నాను.

మరొక విషయాన్ని ఈ సందర్భంగా కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారు మాధవ రెడ్డిగారి మృతిపట్ల సంతాపాన్ని తెలియజేయడానికి లలితకళా తోరణంలో మీటింగు ఏర్పాటు చేసినపుడు, మాధవరెడ్డిగారి పేరు మీద ప్రాజెక్టులను టేకప్ చేస్తామని చెప్పారు. అది నాకు చాలా సంతోషాన్ని కలిగించిరిది. ఎందుకంటే ఏ వ్యక్తి అయితే త్యాగాలు చేశాడో అలాంటి వ్యక్తుల పేర్ల మీద ప్రాజెక్టులు టేకప్‌చేసి వాటికి వారి పేర్లు పెట్టడమన్నది మంచి ఆనవాయితీ.

ముఖ్యమంత్రిగారి కేబినెట్‌లో మాధవరెడ్డిగారు పంచాయతీరాజ్ మినిస్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడు యిదే సభలో నేను ఆయనతో మాట్లాడుతూ, మిమ్ముల్ని డిమోట్ చేశారు, ముఖ్యమైన హోంమినిస్ట్రీ నుంచి ఈ పదవికి తగ్గించారని అన్నపుడు, కాదు,

కాదు నేనే ముఖ్యమంత్రిగారిని స్వయంగా అడిగి ఈ పదవిని తీసుకున్నానని చెప్పడం జరిగింది. నేను ఆయనతో (మాధవరెడ్డిగారితో) చాలా చనువుగా వుండేవాన్ని. యిద్దరం కలసి జోకులు వేసుకునేవాళ్ళం. నేను ఆ విధంగా పదవి గురించి జోవియల్‌గా అన్నపుడు మాధవరెడ్డిగారు నా భుజాల మీద చేతులు వేసి నన్ను తన కేబిన్‌లోకి తీసుకెళ్ళి నేనే స్వయంగా ముఖ్యమంత్రిగారిని రిక్వెస్టు చేసి ఈ పంచాయితీరాజ్ మినిస్ట్రిని తీసుకున్నానని చెప్పారు. ఈ మినిస్ట్రి ద్వారా రాష్ట్ర ప్రజలకు నిజమైన సేవ చేసే అవకాశం కలుగుతుందనే ఆశతో ఈ పదవిని తీసుకున్నానని అందుకు అందరి సహకారం ఉండాలని కోరారు. ఈ మధ్యకాలంలో పంచాయితీరాజ్‌లో మూడంచెల పద్ధతి – అయిదంచెల పద్ధతి, ఈ రెండింటిలో దేన్ని అవలంబించాలనే విషయంపై చర్చిస్తున్న సందర్భంలో మూడంచెల విధానాన్నే తీసుకుంటే బాగుంటుందని మాధవరెడ్డిగారు పత్రికలకు, మీడియాకు చెప్పడం జరిగింది. మాధవరెడ్డిగారి ఆశయాలకు అనుగుణంగా మన ముఖ్యమంత్రిగారు ఈ రాష్ట్రంలో పంచాయితీరాజ్ విధానాన్ని మెరుగుపరచడానికి పూర్తిగా ప్రయత్నం చేస్తారనే నమ్మకం నాకుంది. అదే సందర్భంలో మాధవరెడ్డిగారు కూర్చున్న సీటుపై ఆయనలాగే సమాధానం చెప్పేవారు, విశాలహృదయం కలవారిని కూర్చోబెట్టాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

మరణించిన రాంభూపాల్‌రెడ్డి మరియు నిరంజన్ కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం జరిగింది. ఆ ఎక్స్‌గ్రేషియా తొందరగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఎందుకంటే గతంలో ఉమేష్‌చంద్రతోబాటు మరణించి గన్‌మెన్లకు ఇంతవరకు ఎక్స్‌గ్రేషియా అందలేదనే విషయాన్ని బయట కొంతమంది కానిస్టేబుల్స్ నా దృష్టికి తీసుకొచ్చారు. విధి నిర్వహణలో, ప్రజాప్రతినిధుల రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

10.10 ఉ. శ్రీ తుమ్మల నాగేశ్వరరావు:– అధ్యక్షా, ఈ హౌస్‌లో ఆ మనిషిని గురించి ఈ తీర్మానం పెట్టడం మా అందరి దురదృష్టం. ఆ విషయాన్ని మాట్లాడటానికి కూడా మనసు రావడం లేదు. ఒక మంత్రిగా ఆ జిల్లాకో, ఆ ప్రాంతానికో కాకుండా ప్రజల యొక్క మనోభావాలను ఆకట్టుకునే సందర్భాలు చాలా ఉన్నాయి. మిత్రులు మాధవరెడ్డిగారు ఏ జిల్లాకు వెళ్ళినా మా మాధవరెడ్డి అనే చెప్పుకునే అవకాశం పదవీ కాలంలో కాని, పదవి లేనప్పుడు పార్టీ పదవులలో కాని కలిగింది. ఆంధ్ర రాష్ట్రం యావత్తు ఏ జిల్లాకు వెళ్ళినా వాళ్ళ స్వంత జిల్లా మంత్రిగా వాళ్ళ స్వంత మనిషిగా అభిమానించబడిన వ్యక్తి. ముఖ్యంగా ఖమ్మం జిల్లాకు అత్యంత సన్నిహితుడు. రాజకీయంగా నాకు అత్యంత ఆప్తుడు. ఆనాడు పూజ్యులు ఎన్.టి. రామారావుగారి క్యాబినెట్‌లోకాని, పూజ్యులు చంద్రబాబుగారి క్యాబినెట్‌లో కాని అనేక సమస్యల పట్ల మా రెండు జిల్లాలలో రాజకీయంగా కొంచెం వైరుధ్యం ఉన్నప్పటికీ అక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మేము కలిసి మెలిసి ఉన్నాము. ఆ విధముగా పార్టీ కార్యక్రమాలలో, ప్రభుత్వ కార్యక్రమాలలో మరియు ఆ జిల్లాకు ఎస్.ఎల్.బి.సి. త్వరితగతిన చేయడానికి, అది నా జిల్లా ప్రొజెక్టు

కాదు, తెలంగాణా మొత్తానికి చెందిన ప్రాజెక్టు అని ఎన్నోసార్లు ముఖ్యమంత్రిగారి వద్ద ఒత్తిడి తెచ్చి, దానికి కావలసిన కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర వహించిన సోదరుడు మాధవరెడ్డిగారు. రెండు మూడు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించినప్పటి నుండి మేము రెండు మూడుసార్లు వెళ్లాము. రాబోయే కొద్ది రోజులలో ప్రారంభోత్సవములో కూడ ఆయన ఉంటాడని, ఆ రకముగా సంతోషం కలిగించే అవకాశం తీసుకోవచ్చని అనుకున్నాము. పనులు చాలా ఉధృతముగా జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితులలో రెండు వేల సంవత్సరం లోపల నీళ్లు వచ్చేలా చేయాలని తాపత్రయముతో నిధుల కోసం ప్రభుత్వము మీద, ముఖ్యమంత్రి మీద, నా మీద ఒత్తిడి తీసుకువచ్చి అత్యంత శ్రద్ధాసక్తులు చూపారు. హోమ్ మంత్రిగా ఆయన తిరగని జిల్లా లేదు. నా జిల్లాలో మారుమూల ప్రాంతంలో ఒక రోజు కరకు గూడెం పోలీస్ స్టేషన్ బ్లాస్ట్ అయితే, గౌరవ ముఖ్యమంత్రిగారితో వారు వచ్చి, సెక్యూరిటీ ఏమీ లేకుండా పోలీస్ స్టేషన్ సమీపంలో దిగటానికి సాహసించిన వ్యక్తి. ధైర్యంతో ఆ ప్రాంతానికి వెళ్లి ఆ కుటుంబాలను ఓదార్చేవారు. అటు పోలీసులలో ఇటు ప్రజలలో ఎవరికి ఇబ్బంది వచ్చిన, ఇటువంటి తీవ్రవాద సంఘటనలు భవిష్యత్తులో జరుగకుండా చూస్తామని చెప్పే మనిషి. క్యాబినెట్‌లో కూడా ఆ సమస్యలు వచ్చినప్పుడు మమ్మల్ని అందరిని గట్టిగా మాట్లాడమని చెప్పేవారు. ఒకరు చావవచ్చు, ఒకరు బ్రతుకవచ్చు కాని ఈ విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకూడదని అనేవారు. హోమ్ శాఖా మంత్రిగా ఆయన పరిపాలన ఈ రాష్ట్ర ప్రజలు మరచిపోరని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మాధవరెడ్డిగారినో, కొంతమంది నాయకులనో చంపడం వల్ల తీవ్రవాదులు బావుకునేది కూడా ఏమీ లేదు. వాళ్ల చరిత్ర ప్రజలు ద్వేషించేటట్లుగా తయారు అవుతోంది. గత ఇరవై, ముప్పై సంవత్సరాల క్రితం వారు ఎవరిని అయినా చంపితే సమాజానికి చేటు చేసే వ్యక్తులను చంపారని అనుకునే వారు. కాని ఇప్పుడు వచ్చిన తీవ్రవాదులు, చేసే పనులు విద్యాధరరావుగారు చెప్పినట్లు వారి ఐడియాలజీ వల్ల ఈ సమాజానికి ఒరగపెట్టేది కాని ఒరిగేది, కాని ఏమి లేదు. వారికి ప్రజల తరఫు నుంచి సహకారం లభించడం లేదు. గత ఐదు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వారు నిరసిస్తున్నారని ప్రజలలో ప్రబలంగా వుంది. ఒకళ్లు, ఇద్దరు పోవడానికి కూడా మేము సాహసించి కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నాము. ఆ రకంగా తీవ్ర వాదానికి భయపడే ప్రసక్తి లేదు. ఈ ప్రజాస్వామ్యంలో వెనుకబడిన ప్రాంతాల కోసం అభివృద్ధి ఆపకుండా ముందుకుపోతామని మాధవరెడ్డిగారి సాక్షిగా మనవిచేస్తున్నాను.

రామ్‌భూపాల్‌రెడ్డిగారు చాలా హానెస్ట్ ఆఫీసర్. అందరూ మాధవరెడ్డిగారి ఇంటిలో భోజనం చేసినా, రామ్‌భూపాల్‌రెడ్డిగారు మాత్రం టిఫిన్ క్యారేజ్ తెచ్చుకునే వారు. సెక్యూరిటీలో ఉండగా ఆయన మా ఇద్దరి కార్లలో ప్రయాణం చేసే వారు. వారు ఆ సమయంలో ఆయన చాలా జాగురూకతతో ఉండేవారు. మనం విధి వ్రాసిన వ్రాతను మాత్రం తప్పించలేకపోయాము. మేము మంచి మిత్రుడిని కోల్పోయామని బాధాతప్త హృదయంతో వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియచేస్తూ, మాధవరెడ్డిగారి ఆత్మకు శాంతి చేకూరాలని మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యు. పురుషోత్తమరెడ్డి (రామన్నపేట):– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను. ఒక యువకవి మానవ జీవితాన్ని గురించి

కనులు తెరిస్తే జననం
కనులు మూస్తే మరణం
రెప్ప పాటేరా ఈ జీవితం

అని చెప్పారు. నిన్న మొన్నటి వరకు మన మధ్యలో ఉండి, ఇప్పుడు సుదూర ప్రాంతాలకు వెళ్ళి పోయారు. ఆయనతో నాకు చాలా సన్నిహిత సంబంధం ఉండేది. 1981లో మాధవ రెడ్డిగారు నా ద్వారా రాజకీయాలలోకి రంగ ప్రవేశం చేశారు. నేను ఆయనను సమితి ప్రెసిడెంట్‌గా చేసినందుకు, నా భాగ్యంగా భావిస్తున్నాను. తరువాత ఆయన తెలుగుదేశంలో చేరినా, మంత్రి అయినా కూడా నాతో గౌరవంగా, సన్నిహితంగా ఉండేవారు. అటువంటి సహనశీలి, నిగర్వని పోగొట్టుకోవడం అనేది మనందరికి లోటు అని మనవిచేస్తున్నాను.

మాధవరెడ్డిగారిని వ్యక్తిగతంగా వాళ్ళు చుట్టుపెట్టారని నేను అనుకోవడం లేదు, ఒక ప్రభుత్వ ప్రతినిధిగా ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన-హోమ్‌శాఖను నిర్వహించిన వ్యక్తిగా కక్షతో ఆయనను చంపడం జరిగింది. రోజూ ఎన్నో హత్యలు జరుగుతున్నాయి. గ్రామాలలో, తెలంగాణాలో జన జీవనం పూర్తిగా అస్తవ్యస్తం అయిపోయింది. సామాన్య రైతు గ్రామాలలో ఉండే పరిస్థితి లేదు. రాత్రిపూట అన్నలం అంటూ ఒక వైపు అన్నలు రావటం, ఇంకొక వైపు పోలీసులు వెళ్ళడం జరుగుతుంది. పోలీసులు అన్నలం అంటూ తలుపు తీయమనటం, వారికి మీకు సంబంధాలు ఉన్నాయని అనటం జరుగుతుంది. అలాగే అన్నలు కూడా పోలీసులకు మీకు సంబంధాలు ఉన్నాయనటం బెదిరించటం జరుగుతుంది ఈ రకముగా రోజూ అటువంటి దారుణాలు జరుగుతున్నాయి. ఎంతోమంది హత్యకు గురి అవుతున్నారు. అన్నలు చనిపోయారని పోలీసులు సంతోషపడటం, పోలీసులు చనిపోయారని అన్నలు సంతోషపటడం జరుగుతుంది. దీనివల్ల మన రాష్ట్రం ఎంత వెనుకకుపోతుందన్నది ఎవరూ ఆలోచించడం లేదు. సెక్యూరిటీ చాలా లోపభూయిష్టంగా ఉండటం వల్ల మాధవరెడ్డి గారు చనిపోవడం జరిగింది. ఎన్నోసార్లు కార్లు మారుస్తూ కాన్స్టిక్యువన్స్‌గా టూ క్వాలిస్‌లో రావడం జరిగింది. అర్ధరాత్రి రావటం వల్ల నక్సలైట్లకు వీరి ప్రతి కదలిక తెలిపే సాధనాలు ఎన్నో ఉండటం వల్ల దీనిని అరికట్టలేకపోయాము. పోలీసులు చాలా కష్ట పడుతున్నారు. ప్రభుత్వ లోపం ఉందని నేను అనను. కాని ఇది పరాకాష్ఠకు చేరింది. చాలా ముఖ్యమైన వ్యక్తిని పోగొట్టుకున్నాము. ఇప్పుడైనా మనం వెనుకకు తిరిగి చూసుకొని, శాంతిభద్రతలను కాపాడటానికి మనం తీసుకొనే చర్యలు సరిపోతాయా లేదా అని ఆలోచించవలసిన అవసరం ఉంది. పోలీసులను, నక్సలైట్ల సానుభూతిపరులను, ప్రతిపక్షం వాళ్లను, మంత్రులను పిలిచి ఆ చర్యలను అదుపు చేసే విషయం గురించి ఆలోచించకపోతే, ఇంకా ఇది చాలా దూరం పోయే ప్రమాదం ఉంది. రాను రాను ఇది సివిల్ వార్‌కు దిగే ప్రమాదము ఉంది. పట్టణాలలో ఉన్నవారు కూడా భయభ్రాంతులతో ఉన్నారు. వారు భద్రత ఫీల్ కావడం లేదు. వారికి కూడా అభద్రతా భావం ఉంది. మన విధానం కొంత లోప భూయిష్టంగా ఉంది. దానిని సరిదిద్దుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దానిని గురించి

10.20 ఉ. ఆలోచించకపోతే బాగుండదని మనవిచేస్తున్నాను. పాపం ముఖ్యమంత్రిగారు చాలా కష్టపడుతున్నారు, అందరూ కష్టపడుతున్నారు, అందరికి వారిపై సానుభూతి ఉంది, లేదని కాదు. కాని వారి విధానాలేమిటో సరిగా జరుగుతన్నట్లు నాకు కనిపించడం లేదని మనవిచేస్తున్నాను. మొన్న మందు పాతరలు పెట్టారు. ఇంకెన్ని మందు పాతరలు ఉన్నాయో మనకు తెలియదు. వియత్నాంలో అప్పుడెప్పుడో పెట్టిన మందు పాతరలను ఇప్పటికీ త్రవ్వి తీస్తున్నారంటే 70 సంవత్సరాల వరకు కూడా మందు పాతరలు పనిచేస్తున్నా యన్నమాట. ఇక్కడ ఎన్ని రోడ్ల మీద పెడుతున్నారో, ఏమి చేస్తున్నారో మనకు అర్థం కావడం లేదు. ఇలాంటివి జరుగుతున్నప్పుడు మనం స్పందించవలసిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు దీనిపై తీవ్రంగా ఆలోచించి వారిని ఒకసారి పిలవండి, మాట్లాడండి. ఇంకా వేరే సాధనాలు ఏమైనా వుంటే ఆలోచించాలని చెపుతున్నాను. ఈ సందర్భంలో నేను జాషువా పద్యం ఒకటి చెప్పి విరమిస్తాను. జాషువా ఏమన్నారంటే—

రాజు మరణించె, ఒక తార రాలిపోయె
కవియు మరణించె, ఒక తార గగనమెక్కె
మాధవుడు మరణించె, దేవలోకమేగె
రాజు జీవించె రాతి విగ్రహములయందు
కవియు జీవించె ప్రజల నాలుకలయందు
మాధవుడు జీవించె ప్రజల హృదయములయందు.

ఆయన మా జిల్లావాడు కాబట్టి, మాకు ఆప్తుడు కాబట్టి వారి కుటుంబ విషయంలో గాని, వారి విషయంలోగాని మాకు చాలా బాధగా ఉంది. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని, సంతాపాన్ని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

---

శ్రీ ఎన్. నరసింహయ్య (నకిరేకల్):— అధ్యక్షా, పువ్వు పుట్టగానే పరిమళం వెద జల్లినట్లుగా మాధవరెడ్డిగారు బి.ఇ. గ్రాడ్యుయేట్ అయ్యివుండి కూడా, ఉద్యోగ అవకాశాలు ఉండి కూడా రాజకీయాలలోకి వచ్చి గ్రామ సర్పంచ్‌గా, సమితి అధ్యక్షుడిగా, నాలుగు పర్యాయాలు ఎం.ఎల్.ఏ.గా వుండి రాజకీయ పట్టుదలతో నల్లగొండ జిల్లాలో ఒక మంచి నాయకుడిగా ఎదిగిన విషయం మేము మర్చిపోలేనిది. ఇంతమంచి నాయకుడిని కోల్పోతా మని మేము ఎప్పుడుకూడా అనుకోలేదు. అనుకోని ఈ సంఘటనకు మేము ఎంతో విచా రిస్తున్నాము. ఒక ప్రత్యేకమైన గుణగణాలు వున్నటువంటి వ్యక్తి మాధవరెడ్డిగారు. తన మనసులో ఏమున్నాసరే పైకి మాత్రం చిరునవ్వుతో వుంటూ ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారినైనా కలుపుకొనిపోయే పరిస్థితి మా జిల్లాలో మేము చూసాం. మేము దాదాపుగా 20 సంవత్సరాలపాటు వారితో కలిసివున్నాం. ఈనాడు మాధవరెడ్డిగారు మన మధ్య లేకుండా పోయినందుకు విచారాన్ని తెలియచేస్తూ, ప్రత్యేకంగా మేము మా జిల్లా మంత్రిని కోల్పోయినందుకు ఎంతో విచారాన్ని వెలిబుచ్చుతున్నాము. వ్యక్తులను నిర్మూలించడం ద్వారా ఏదో సాధిస్తామని అనకోవడం సరైంది కాదు. దానివల్ల ఏ సమాజం మారలేదు, వ్యవస్థ మారలేదు. ఆ చరిత్ర మన ముందు వుంది. అందువల్ల ఈ వ్యక్తిగత హింసను

విడనాడాలని, ఇది సరైంది కాదని మొదటినుంచి నేము మా సి.పి.ఐ.ఎం. పార్టీ పక్షాన దీనిని వ్యతిరేకిస్తూనే వున్నాము. ముఖ్యంగా మా జిల్లాలో వున్నటువంటి ఎస్.ఎల్.బి.సి.కి స్వర్గీయ మాధవరెడ్డిగారి పేరు పెట్టాలని నిర్ణయం తీసుకోవడం చాలా మంచి నిర్ణయం. ముఖ్యమంత్రిగారు ఈ నిర్ణయం తీసుకోవడం చాలా మంచిది. ఇక 2000 సంవత్సరం సెప్టెంబరు నాటికి ఈ కాలువ ద్వారా నీరు అందిస్తే ఈ కాలువద్వారా కీర్తిశేషులు మాధవ రెడ్డిగారు మాకు సేవలు అందిస్తున్నట్లుగా వుంటుంది కాబట్టి ఆ పని చేసి గతంలో ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరుతున్నాను. ఇంకో విషయం ఏమిటంటే శ్రీరాంసాగర్ రెండవ దశను మాధవరెడ్డిగారి చేతులమీదుగా ప్రారంభం చేశారు. దానికి కేంద్రం కూడా అనుమతించింది. కాబట్టి దానిని కూడా పూర్తి చేయించినట్లయితే మాధవరెడ్డిగారి సేవలు మాకు చిరస్మరణీయంగా మిగిలిపోతాయని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. ఇక మాధవ రెడ్డిగారితోపాటు చనిపోయిన సెక్యూరిటీ అధికారి మరియు డ్రైవర్ల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నాను. మాధవరెడ్డిగారి కుటుంబానికి మా సి.పి.ఐ.ఎం. పార్టీ శాసనసభా పక్షాన సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నాను.

డా॥ ఎన్. జనార్ధనరెడ్డి:- అధ్యక్షా, ఈనాడు ఈ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గాని, దీనిపై చర్చ జరగడంగాని ఎంతో బాధాకరంగా ఉంది. మనం ఎవరం కూడా ఊహించని విషయం ఇది. ఎప్పుడూ నవ్వుతూ, మనందరినీ నవ్విస్తూ, ఎప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరిగినా ఉదయంనుంచి సమావేశం పూర్తయ్యేవరకూ తన సీటులోనే కూర్చుంటూ, ఎంత మంది శాసనసభ్యులు వచ్చి తనను కలుస్తున్నప్పటికీ అందరికీ నవ్వుతూ సమాధానం చెప్పే మాధవరెడ్డిగారు మన మధ్యన లేకపోవడం మనందరికీ ఎంతో బాధాకరంగా ఉంది. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు వుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే సిద్ధాంతాన్ని నమ్మి హోంశాఖ మంత్రిగా తన విధులను నిర్వహించినప్పుడు, శాంతిభద్రతల పరిరక్షణకోసం నిర్ణయాలు తీసుకొన్నప్పుడు అది కొంతమంది తీవ్రవాదులకు బాధకలిగించి ఈనాడు ఆయన మృతికి కారణం కావడం నాకు బాధ కలిగించింది. దానిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఒక విధంగా శాంతిని కాంక్షించే మాధవరెడ్డిగారు రాష్ట్రాభివృద్ధికోసం తన జీవితాన్ని త్యాగం చేసారని నేను తెలియచేస్తున్నాను. నేను హెల్త్ మినిస్టరుగా వున్నప్పుడు మాధవరెడ్డిగారు ఒక విషయం గురించి నాతో ఎప్పుడూ చెప్పేవారు. తాను హెల్త్ మినిస్టర్‌గా వున్నప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసానని, అందువల్ల డిపార్ట్‌మెంట్ వారు ఇప్పటికీ తనను మరిచిపోలేదని ఆయన అంటుండేవారు. అయితే తన జిల్లాలోని 5 హాస్పటల్‌ను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తేవాలనుకొన్నానని, కాని ఆ పని జరగలేదని, ముఖ్యమంత్రిగారికి కూడా ఈ విషయం గురించి చెప్పానని ఆయన నాతో చెపితే నేను ఆ 5 హాస్పిటల్స్‌ను వైద్య విధానపరిషత్ పరిధిలోకి మార్చడం జరిగింది. ఈ విషయాన్ని నేను గుర్తు చేసుకొంటున్నాను. ఈ విషయం నేను ఎందుకు చెప్పుతున్నానంటే ఆయన ఏదైనా సాధించాలనుకొన్నప్పుడు వెంబడిపడి ఖచ్చితంగా చేయించేవారు. ముఖ్యంగా జన్మ భూమి కార్యక్రమాల సందర్భంగా ఎం.ఎల్.ఏ.లను, అధికారులను అందరినీ ఒక బస్సులో తన వెంట తీసుకొని జిల్లా మొత్తం తిరిగి నల్లగొండ జిల్లా ప్రజలలో ఒక మరపురాని వ్యక్తిగా నిలిచిపోయారు. మొన్న వారి అంతిమయాత్ర జరిగితే తెలుగుదేశం పార్టీవారితోపాటు

అశేష జనవాహిని ఆ అంతిమ యాత్రలో పాల్గొనడం జరిగింది. ప్రజలలో ఆయనపట్ల వున్న అభిమానానికి అదే నిదర్శనమని మనవిచేస్తున్నాను. ఈనాడు వారు లేని లోటు తీరనిది. మాధవరెడ్డిగారి మరణం తెలుగుదేశం పార్టీకి కూడా తీరని లోటని మనవిచేస్తున్నాను. హైదరాబాదులో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఏ సభలు జరిగినా, మహానాడులు జరిగినా నల్లగొండ జిల్లానుంచి, మహబూబ్‌నగర్ జిల్లానుంచి అధిక జనాన్ని తీసుకురావడానికి మేము పోటీపడేవాళ్ళం. దానిలో మాధవరెడ్డిగారు ఎప్పుడూ ముందువుండేవారు. ముఖ్యమంత్రిగారు ఆయనకు పార్టీకి సంబంధించి ఏ బాధ్యతను అప్పచెప్పినా దానిని జయప్రదం చేసేందుకు ఆయన కృషి చేసేవాడని నేను మనవిచేస్తున్నాను. ఈనాడు ఆయన లేకపోవడం రాష్ట్ర ప్రజలకు తీరని లోటు. ఈనాడు పంచాయతీరాజ్ శాఖామంత్రిగా వుండి పంచాయతీ రాజ్ వ్యవస్థలో విధానాలను మార్చవలసిన అవసరం ఉందని చెప్పి ఢిల్లీకి కూడా వెళ్లి అన్ని రాజకీయ పక్షాలవారితోనూ, ముఖ్యంగా పార్లమెంటు సభ్యులతో మాట్లాడి రాజ్య సభలో చట్టాన్ని పాస్ చేయించారు. చట్టంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేసిన వ్యక్తి ఆయన. వారి మరణం మనందరికీ బాధ కలిగించింది. ముఖ్యంగా ఈ సందర్భంలో నేను తీవ్రవాదులను కోరేది ఏమిటంటే కొంతమంది వ్యక్తులను చంపినంత మాత్రాన వారు ప్రజాస్వామ్యాన్ని అణచలేరు. మేమంతా మధ్య తరగతినుంచి వచ్చినవాళ్ళమే. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఈనాడు ఎం.ఎల్.ఏ.లుగా ఎన్నికైనవాళ్ళం ఇక్కడ ఎంతో

10.30 ఉ. మందిమి వున్నాం. ఈనాడు వారు తుపాకీ గొట్టంతో అధికారంలోకి రావాలని అనుకుంటున్నారు. కాని ఏ ప్రాంతంలో కూడా, ఎక్కడ కూడా అది సాధ్యం కాలేదు. ఈనాడు ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతం అయిన తెలంగాణాలో అభివృద్ధి సాధించాలంటే, శాంతి ఎంతో అవసరం. ఈనాడు ఇండస్ట్రీస్ రావడం లేదు. ప్రాజెక్టులు నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈనాడు ప్రజాస్వామ్యంలో ప్రజలతో అనుబంధం కలిగిన వ్యక్తుల విధినిర్వహణలో ముందుకు వెళుతున్నారు. అటువంటి వారికి అడ్డం రావడం సమంజసం కాదు. వారి పంథాను మార్చుకోవాలి. జనజీవన స్రవంతిలో కలువాలి. పేద ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశ్యంతో తెలుగుదేశం పార్టీగాని, ప్రభుత్వం గాని ఈనాడు ముఖ్యమంత్రిగాని చేపట్టే కార్యక్రమాలు వెనుకబడిన ప్రాంతంలో అభివృద్ధి కోసం చేయడం జరుగుతోంది. అవి కూడా ఒకసారి ఆలోచించుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను వారికి. ఏదో కొంతమందిని చంపడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు ఆగవు. శాంతి, అభివృద్ధికోసం పనిచేస్తున్నారు. ఈనాడు తెలంగాణా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే శాంతి అవసరం. దాని విషయంలో కూడా మనమందరం ఆలోచించాలని. అధైర్యపడవలసిన అవసరం లేదు. ప్రజలకోసం పనిచేయడానికి అందరూ ముందుకు రావలసిందిగా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈనాడు ఎంతో బాధతప్త హృదయంతో మాధవరెడ్డిగారి మృతికి వారి యొక్క భార్యపిల్లలకు, బంధుమిత్రులకు నా ప్రగాఢమైన సానుభూతిని తెలియచేస్తూ, వారియొక్క ఆత్మకు శాంతి కలుగాలని దేవునితో ప్రార్థిస్తున్నాను. అదేవిధంగా వారి సెక్యూరిటీ అధికారులు రాంభూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిగారు మాధవరెడ్డిగారి వెంబడే వుండి, వారికి రక్షణ కల్పించడానికి ఎంతో ప్రేమతో వుండేవారు కూడా. వారుకూడా చని పోవడం జరిగింది. వారి ఆత్మకు శాంతికలగాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియ చేస్తున్నాను..

శ్రీ ఎస్.వి. సుబ్బారెడ్డి (ప్రత్తికొండ):- మేడమ్ స్పీకర్, ముఖ్యమంత్రిగారు మాధవరెడ్డిగారి మృతిపట్ల ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను. 'మ' అంటే మంచికి; 'ద' అంటే దయాగుణానికి; 'వ' అంటే విశిష్ట వ్యక్తిత్వానికి మారు పేరు అయిన మాధవరెడ్డిగారి మరణం ఆంధ్రరాష్ట్రంలో మేధావులకు, రాజకీయవేత్తలకు తీరని లోటు. మాధవరెడ్డిగారు లేని లోటు తెలుగుదేశం పార్టీకి ఎంతో వుందని మీద్వారా మనవి చేస్తున్నాను. ముఖ్యంగా, ముఖ్యమంత్రిగారికి అంతరంగికుల్లో ఒకరు అయిన మాధవ రెడ్డిగారు లేని లోటు మన అందరికంటే ముఖ్యమంత్రిగారికి చాలా బాధపెట్టి వుంటుంది. ఎంతో కష్టతరమైన కార్యాన్ని కూడా చెరగని చిరునవ్వుతో దానిని ఎలాగైన పూర్తిచేస్తాను అనే నమ్మకంతో పనిచేసే వారు. నేనూ, మాధవరెడ్డిగారు మా జిల్లాలో ఎన్నో ఎలక్షన్స్ లలో కలిసి తిరిగాము. మనం ఓడిపోతున్నామని తెలిసి కూడా మాధవరెడ్డిగారు చిరునవ్వుతో స్పోర్టివ్‌గా తీసుకునేవారు. ఈ రోజు మాధవరెడ్డిగారి మరణంపట్ల నేను ఒక స్వంత తమ్ముణ్ని పోగొట్టుకున్నట్లుగా బాధపడుతున్నాను. మీరు కూడా (స్పీకరుగారిని ఉద్దేశించి) మరియు మాధవరెడ్డిగారు కలిసి తిరిగిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఎప్పుడు అయినా గాని, ఎంతకష్టం అయినా గాని ధైర్యంగా చెరగని చిరునవ్వుతో స్వీకరించేవారు. అలాంటి వ్యక్తిమన మధ్యలేకపోవడం, నిజంగా చాలా బాధాకరమైన విషయం. ఎప్పుడూ నన్ను 'అన్న' అని పిలిచేవారు. వారు, నాకు తెలిసినంతవరకు నా పేరుతో ఎన్నడూ సంబోధించ లేదు. అలాంటి మాధవరెడ్డి లేని లోటు – నా స్వంత తమ్ముడు లేని లోటుగా బాధపడు తున్నాను. అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. అలాంటి కార్యక్రమాలను తన స్వంత బాధ్యతగా స్వీకరించి ఎంతో ధైర్యంతో, ఉత్సాహంగా చేసే వారు. అలాంటి వ్యక్తిలేని లోటు తెలుగుదేశం పార్టీకి ఎంతో ఉంది. భగవద్గీతలో చెప్పి నట్లు : 'జాతస్యమరణం ధృవం' అన్నట్లుగా ప్రతి మనిషికి చావు తప్పదు. మనిషికి చావు వుంటుంది కాని, ఆత్మకు చావువుండదు. ఆయన ఆత్మ మన అసెంబ్లీలో పరిభ్రమిస్తూనే వుంటుంది. ఇక్కడ, ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రజాసేవకు ఉపయోపగడే విధంగా మన అందరిని ప్రోత్సాహపరుస్తుందని మీద్వారా మనవిచేస్తున్నాను. మాధవ రెడ్డిగారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతునితో ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. నర్సింహులు (ఆలేర్):- అధ్యక్షా, మాధవరెడ్డిగారి మరణం చాలా బాధా కరమైన విషయం. ముఖ్యంగా, తీవ్రవాదం అనేది పేట్రేగిపోయిందని చెప్పడానికి ఇది నిదర్శనమని మీద్వారా తెలియచేస్తున్నాను. వాస్తవంగా మాధవరెడ్డిగారికి, ; నాకు ఉన్న సంబంధం, ఆత్మీయతానుబంధం నా తరువాతే మిగతా వారందరికి వుంటుందని నేను చెప్పడానికి వెనుకాడడం లేదని మనవిచేస్తున్నాను. ఎందుకంటే నేను రాజకీయాలలోకి 1983లో ఎన్.టి.ఆర్. ఆశిస్సులతో వచ్చినపుడు, ఆయన సమితి ప్రెసిడెంటుగా కాంగ్రెసుతో వుండే వారు. తరువాత, మాధవరెడ్డిగారిని తెలుగుదేశం పార్టీకి, అన్నగారికి పరిచయం చేయడంలో గాని, శ్రీ రఘుమారెడ్డిగారికి 1984 లో పార్లమెంటు సీటు ఇస్తే, మాధవరెడ్డిగారికి ఇవ్వాలని నేను చేసిన ప్రయత్నం ముఖ్యమంత్రిగారికి ఇవన్నీ తెలియనివి కావు. మా జిల్లాలో జానారెడ్డిగారు, నర్సింహులు, మాధవరెడ్డిగారు అనేది – 1983 నుంచి ఎన్నో కార్యక్రమాలు చేశాము. ప్రజలకు చేసి చూపించాము. మాధవరెడ్డిగారు నేనూ, ప్రజల హృదయాలను

దోచుకోవడం, పాటుపడడం గాని మరొకటి లేదని మీద్వారా మనవిచేస్తున్నాను. ఒక దశిత శాసనసభ్యుడిగా వెళ్ళినంతవరకు ప్రజల మధ్య వుండి, ప్రజలకోసం బ్రతికాము. రాజకీయంలో బేధాలు వున్నప్పటికి మేము ఇద్దరమూ కలిసి చేసిన పనులు కోకొల్లలు అని మనవిచేస్తున్నాను. వాస్తవంగా జన్మభూమి కార్యక్రమాలలో నేను వెళ్ళను. నా నియోజకవర్గంలో కలిసి తిరిగాము. షేక్‌హ్యాండు తీసుకున్నాము. భోనగిరి ప్రజలు ఇందుకు ఎంతో సంతోషపడ్డారు. పత్రికలలో ఇద్దరు – మాధవరెడ్డిగారు, నర్సింహులు కలియబోతున్నారని వ్రాసినపుడు ప్రజలు సంతోషపడ్డారు. ఎన్నో ప్రారంభోత్సవాలను, ఇనాగరేషన్స్ చేశాము. ఎంతో సంతోషంగా, ఎన్నో జోక్సువేసుకున్నాము. మాధవరెడ్డిగారూ మనం ఇద్దరం కలువడం వల్ల ప్రజలు ఎంతో సంతోషంగా వున్నారని చెప్పినప్పుడు లేచి నాకు షేక్‌హ్యాండ్ చేసి అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని రాష్ట్రాన్ని ముందుకు తీసుకురావలసిన అవసరం ఉందని, ఏరకమైన ఆరోపణలు చేసుకోవలసిన అవసరం లేదని మాట్లాడుకున్న విషయం నేను యీ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. ఏది ఏమైనా ఈనాడు మాధవరెడ్డిగారు నల్లగొండ జిల్లా ప్రజానీకానికి భువనగిరి, ఆలేరు -ప్రజలలో వుండే అనుభంధం, ఆయన సమితి ప్రెసిడెంటుగా – నా నియోజకవర్గంలో కొంత పనిచేసిన వ్యక్తి ఆయన.

10.40 ఉ. అదే రకంగా మొన్న జరిగిన శాసనసభ ఎన్నికలలో ఎం. నర్సింహులు ఓడిపోతారని, మాధవరెడ్డి ఓడిపోతారని అనుకున్నా కానీ ఇద్దరమూ కూడా వెరి 7 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాము. అంతకుముందు ఎన్నికలలో నేను, ఆయనా కూడా 40 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాము అంటే ప్రజలలో మా సంబంధం ఏ విధంగా ఉందనేది అర్థం అవుతుంది. ఏది ఏమైనా భగవంతుడు ఇంత త్వరగా వారిని తీసుకుపోవడం చాలా బాధాకరం. తీవ్రవాదం పేరుతో నక్సలైట్లు ఈ రకంగా దారుణంగా హత్య గావించడం ఎంతమాత్రం న్యాయం కాదు. ప్రజాస్వామ్య యుగంలో ఈ రకంగా అరాచకంగా హత్య చెయ్యడం భావ్యం కాదు. ఏదయినా చెయ్యగలిగితే ప్రజాస్వామ్యబద్ధంగా చెయ్యాలి తప్ప, ఈ విధంగా వ్యక్తులను తీసుకుపోవడం చేసినంత మాత్రాన, ఈ విధంగా హత్యలు చేసినంత మాత్రాన జరిగేది, ఒరిగేది ఏమీ లేదు. ముఖ్యమంత్రిగారి దృష్టికి నేను ఒక విషయం తీసుకువస్తున్నాను. నక్సలైట్లు జన జీవన స్రవంతిలోకి రావాలని ఇచ్చిన పిలుపు మేరకు ఎంతో మంది వారి నక్సలిజాన్ని విడనాడి వస్తున్నారు. వాస్తవంగా నక్సలిజం మంచిది కాదని తెలిసినా, తెలిసో తెలియకో దానిలోకి చేరిన వారు ముఖ్యమంత్రిగారి వద్దకో, మాధవరెడ్డిగారి వద్దకో, ఎస్.పి. గారి వద్దకో, డి.ఎస్.పి.గారి వద్దకో వచ్చి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారు చాలా మంది ఉన్నారు. అయినప్పటికీ వారిని అనేక విధాలుగా పోలీస్ స్టేషన్స్‌కు పిలిచి ఇబ్బందులు పెడుతున్న విషయం ముఖ్యమంత్రిగారు గమనించాలి. నక్సలైట్లు వారి ధోరణిన్ని విడనాడి, ప్రజలతో కలవాలని, ప్రజలలో వారు ఉండాలని ముఖ్యమంత్రిగారికి ఆలోచన ఉంది కనుక ఈ విషయం వారు ఆలోచించాలని కోరుతున్నాను. ఏది ఏమైనా మా జిల్లా ప్రజలు, మేము, నేను అంతా కూడా మాధవరెడ్డిగారి ఇంటికి పోతే, అక్కడ వారి కుటుంబ సభ్యుల రోదనను చూడవలసి రావడం ఎంతో బాధాకరమైన విషయం. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక పెళ్లైా కాని అబ్బాయి ఉన్నారు. ముఖ్యమంత్రిగారి ఆశీస్సులు వారి కుటుంబం మీద ఉండాలి. ఏ రాజకీయ పార్టీ అయినా సరే మేము

ఇద్దరమూ ప్రజలలో పనిచెయ్యడానికి ఎంతో ముందుకు సాగిన విషయాన్ని మరొకసారి గుర్తు చేసుకుంటూ, ఎస్.ఎల్.బి.సి.కి మాధవరెడ్డిగారి పేరు పెట్టడానికి ముఖ్యమంత్రిగారు నిర్ణయించడం చాలా సంతోషకరమని భావిస్తున్నాను. కలెక్టర్ ఆఫీసుకు కూడా వారి పేరు పెడతామన్నారు. భువనగిరిలో ఏరియా హాస్పటల్ ఉంది. మాధవరెడ్డిగారే ప్రారంభోత్సవం చేశారు. నియోజకవర్గం హెడ్‌క్వార్టర్స్‌లో ఉంది. ప్రజలు ఎప్పుడూ చూసుకునే బిల్డింగ్ అది. 30 బెడెడ్ హాస్పటల్. దానికి కూడా మాధవరెడ్డిగారి పేరు పెడితే బాగుంటుందని కోరుతున్నాను. వారి కుటుంబానికి భగవంతుడు తోడుగా ఉండాలని కోరుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ శంకినేని వెంకటేశ్వరరావు (తుంగతుర్తి):– అధ్యక్షా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు – రాష్ట్ర మంత్రిగారయిన కీర్తిశేషులు మాధవరెడ్డిగారి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టినందుకు దానితో ఏకీభవిస్తూ, మాధవరెడ్డిగారి మృతిపట్ల సంతాప తీర్మానం ప్రవేశపెట్టే పరిస్థితి వస్తుందని నేనుఎప్పుడూ అనుకోలేదు. తీవ్రవాదుల చేత ఎంతోమంది చనిపోయిన వారికి శాసనసభలో సంతాపాన్ని వెలిబుచ్చిన మాధవరెడ్డిగారు ఈ రాష్ట్రంలో గల ప్రజలకు సంబంధించి శాంతిభద్రతలు కాపాడాలని అనే ఆలోచనతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలవల్ల, ప్రభుత్వ విధానాలకు కట్టుబడి 5 సంవత్సరాలు హోంశాఖ మంత్రిగా ఉండి ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన వారు చివరకు తీవ్రవాదుల చేత హత్య గావింపబడడం బాధాకరమైన విషయం. తీవ్రవాదులకు మాధవరెడ్డిగారిని చంపే అవసరం ఎందుకు వచ్చిందనేది ఆలోచిస్తే ఇప్పటివరకూ సమాధానం దొరకడం లేదు. 1985వ సంవత్సరంనుంచి తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో మాధవరెడ్డిగారితో నాకు అవినాభావ సంబంధం ఉంది. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులుగా మాధవరెడ్డిగారితో సంబంధమే కాకుండా, మొన్న జరిగిన శాసనసభ ఎన్నికలలో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో శాసనసభకు తుంగతుర్తి నియోజకవర్గంనుండి గెలిచాను. గత 53 సంవత్సరాలలో అక్కడ వామపక్షపార్టీలు, కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ఉండడంవల్ల జిల్లా చాలా వెనుకబడింది. శాసనసభకు నేను గెలిచిన తరువాత మాధవరెడ్డిగారి నాయకత్వంలో ముఖ్యమంత్రిగారి దృష్టికి తేవడం జరిగింది. గత నాలుగున్నర సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మాధవరెడ్డిగారు 8, 9 మాసాలు ఆరోగ్య శాఖమంత్రిగా, తరువాత హోంశాఖ మంత్రిగా జిల్లాలో ఎంతో అభివృద్ధి చెయ్యడం జరిగింది. 53 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి ఈ రోజు నల్గొండ జిల్లాలో జరిగింది. ఏ గ్రామానికి వెళ్ళినా, ఎక్కడకు వెళ్ళినా ఎన్నో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వారి నాయకత్వంలో జరిగాయి. అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. 1983 తరువాత రామారావుగారు ఎస్.ఎల్.బి.సి. మొదలుపెడితే, 1989 నుంచి 1994 వరకు దానికి నిధులు కేటాయించక, అసంపూర్తిగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రిగారి పైన వత్తిడి చేసి, నిధులు కేటాయించుకున్నారు. ఈ రోజు దానికి మాధవరెడ్డిగారి పేరు పెట్టాలని ముఖ్యమంత్రిగారు నిర్ణయించడం సంతోషించవలసిన విషయం. వారి పేరు పెట్టాలని నిర్ణయించినందుకు జిల్లా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూడా వారి పేరు పెట్టాలని నిర్ణయించడం జరిగింది. ఈ రోజు సాయంత్రం గం. 4.30 లకు నామకరణం చేయడం జరుగుతుంది. దానికి

ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను· ఎస్·ఎల్·బి·సికే కాకుండా శ్రీరాం సాగర్ రెండవ దశ కేవలం నల్గొండ జిల్లాకే కాకుండా తెలంగాణా జిల్లాలయిన ఖమ్మం, వరంగల్‌లకు పనికి వచ్చే దానికి ముఖ్యమంత్రిగారు శంకుస్థాపన చేశారు· శ్రీరాంసాగర్ రెండవ దశకు నిధులు కేటాయించి, 5 సంవత్సరాలలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు· దీనికి కూడా మాధవరెడ్డిగారి పేరు పెట్టాలని కోరుతున్నాను· ఎస్·ఎల్·బి·సిని ఈ సంవత్సరం పూర్తి చేస్తామన్నారు· అట్లాగే ఎస్·ఆర్·ఎస్·సి· – స్టేజ్ 2కు కూడా నిధులు కేటాయించి, పూర్తి చేయడం ద్వారా వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతున్నాను· అదే విధంగా వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరు కుంటూ సెలవు తీసుకుంటున్నాను·

శ్రీ జి· అప్పల సూర్యనారాయణ (శ్రీకాకుళం):– అధ్యక్షా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను· 1985లో మాధవరెడ్డిగారితోపాటు ఈ శాసనసభలో నేను అడుగుపెట్టడం జరిగింది· ఒక సన్నిహితుడుగా, నిగర్విగా, చక్కటి అడ్మినిస్ట్రేటర్‌గా వారు మనందరికి పరిచితులన్న విషయం అందరికీ తెలిసిందే· మాధవరెడ్డిగారు చనిపోయిన విషయం ఆ రోజు రాత్రి తెలిసినప్పుడు కుటుంబ సభ్యుడు చనిపోయినట్లుగా మనందరం ఎంతో బాధపడ్డాము· ఆయన మొదటినుంచి నాతో ఎంతో చనువుగా ఉండి 'అప్పలా' అని పిలిచే వారు· ప్రతి ఒక్కరితో చాలా చక్కని రిలేషన్ షిప్ మెయిన్‌టెయిన్ చేసేవారు· వారు హెల్త్ మినిస్టర్‌గా ఉండి రాష్ట్రంలో అనేక హాస్పటల్స్ నిర్మించే విషయంలో కానీ, చాలా చక్కటి విధాన నిర్ణయాలు చేయడం కానీ మనందరికీ తెలిసిందే· వారు హోం మినిస్టర్‌గా ఎంతో సక్సెస్‌ఫుల్‌గా పని చెయడమే కాకుండా, పంచాయతీరాజ్ శాఖను వారికి ఇచ్చినప్పుడు దానిని కూడా ఎంతో చక్కగా నిర్వహించాలనే
10·50 ఉ· తాపత్రయంతో ఉన్న విషయం మనందరికీ తెలుసు· మన జిల్లాలో చాలామంది సీనియర్ మెంబర్స్ ఉండడంవల్ల మన అందరితో చక్కని సన్నిహితత్వం ఉంది· మీరు, నేను అదే విధంగా మాధవరెడ్డిగారు సీనియర్ శాసనసభ్యులం ఎన్నోసార్లు మన జిల్లాలో పర్యటనలు చేసిన సందర్భాలు కూడా ఈ సందర్భంగా మీకు తెలుసని మనవి చేస్తున్నాను· మొన్న శ్రీకాకుళం జిల్లాలో ఆ యొక్క సానుభూతి గురించి మీటింగ్ పెట్టి నప్పుడు సీనియర్ శాసనసభ్యులు, మంత్రులు అందరు తెలియచేశారు· మన జిల్లాలో ఆయన పేరు జ్ఞాపకం ఉండాలని అందుకోసం ఏదయినా భవంతికి పేరు పెడితే బాగుంటుందనే విషయం కూడా తీర్మానం చేయడం జరిగింది· ముఖ్యమంత్రిగారిని నేను కోరుకుంటున్నాను· జడ్·పి· హాల్ కూడ కన్‌స్ట్రక్షన్‌లో ఉంది· అటువంటి దానికి ఏదయినా సరే ఆయన పేరు పెడితే బాగుంటుంది· మన జిల్లాలో ఆయనకు ఉన్నటువంటి సన్నిహితత్వానికి నిదర్శనంగా ఉంటుందని శాసనసభ్యులు చెప్పారు కాబట్టి ఖచ్చితంగా చేస్తారన్న భావన నాకు ఉందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను·

అదే సందర్భంలో డెమక్రసీ గురించి 'వాగ్లాగారు' ఒక విషయం చెబుతారు· ఆయన చెప్పిన దానిని ఇక్కడ తెలియచేస్తున్నాను· Dictatorial type of Governments and totalitarian type of Governments may deliver good results, but there is no freedom and liberty in them. ఏదయినా డిక్టేటోరియల్

ట్రిప్, టోటాలిటేరియన్ ట్రిప్ ఆఫ్ గవర్నమెంట్ గాని మంచి రిజల్ట్స్ ఇచ్చేటప్పుడు కూడా వ్యక్తిగతంగా ఇండివిడ్యుయాలిటీని దెబ్బ తీస్తుంది. పార్లమెంటరీ డెమక్రసీలో వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికీ అటువంటి స్వేచ్ఛను ఇచ్చినప్పుడు రిజల్ట్స్ డిలేటింగ్ ఇవన్నీ జరగడం వల్ల కాస్త లేటయినా కూడా పార్లమెంటరీ డెమక్రసీ అన్నది ఈనాడు ప్రపంచవ్యాప్తంగా, ఒక మంచి వ్యవస్థగా రూపు దిద్దడానికి కారణం అన్న విషయం తెలియచెప్పిన దానిని మీ అందరికీ తెలుసు అని నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అటువంటి సందర్భంలో వ్యక్తిగతమైన. స్వేచ్ఛకు ఏమాత్రం భంగం కలిగించకుండా ఉండవలసిన గురుతరమైన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉంటుందని చెప్పి ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

అదే సందర్భంలో జూలియస్ సీజర్‌లో ఒక విషయం అంటారు. 'Murder will lead to murder, but where is the end for it. Murder, Murder, murder, murder, murder, murder..... మర్డర్ అన్నది మర్డర్‌కు లీడ్ చేస్తుంది. దానివల్ల రిజల్ట్ ఏమీ లేదు. మర్డర్, మర్డర్, మర్డర్, మర్డర్, మర్డర్. మర్డర్ కాకుండా ప్రివెన్షన్ అన్నది మనకు కావాలి అని రాజరికంలో ఉన్నటువంటి జూలియస్ సీజర్ నాటకంలో ఒక విధానం మీద వ్రాసిన సిద్ధాంతం అని చెప్పి నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదే విధానంలో సామాజిక పరిణామాల గురించి మనం ఆలోచన చేసినప్పుడు కూడ ర్యాడికలిజమ్ అధ్యయనం చేసినప్పుడు కూడా రిజల్ట్స్ ఏమీ లేవనేది మనం అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతయినా ఉందని మనవిచేస్తున్నాను. ఈనాడు ప్రపంచంలో కానీ, దేశంలో కాని, రాష్ట్రంలో కాని సమస్యలు లేవు అని అనడం లేదు. సమస్యలు ఉన్నాయి. సమస్యలు ఉన్నప్పుడు మనం అధిగమించడానికి ప్రయత్నం చేయవలసిన అవసరం ప్రతి మనిషికి ఉంటుంది. ఏ మనిషి అయినా సమస్యలను తీర్చడానికి ప్రయత్నం చేయకపోతే ఎస్కేపిజం అవుతుందని చెప్పి ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఆ సమస్యలను దాటవేయడానికి ప్రతి ఒక్కరం ప్రయత్నం చేయాలి.. ఆ ప్రయత్నంలో ఏ విధానాలను అవలంభిస్తే బాగుంటుందని అన్న విషయం మీద మనం అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అదే సందర్భంలో ఏనిహిలేషన్ అన్నది చారిత్రక సత్యాలను చూపినప్పుడు ఎక్కడా ఏ రిజల్ట్స్ మనకు ఇవ్వలేదు. గాంధీజీనుంచి కెన్నడీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ నుంచి ఈనాడు మాధవరెడ్డిగారి వరకు చూస్తే వ్యక్తిగత ర్యాడికలిజమ్ అని నాకు అని పిస్తుంటుంది. ఏనిహిలేషన్‌వల్ల గుడ్ రిజల్ట్స్ మనం తేలేము. అటువంటి పరిస్థితుల్లో శాంతిభద్రతలకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి అన్నది, ఎటువంటి విధానాల ద్వారా తీసుకోవాలన్నది ఉంటుంది. పూర్ కోసం పని చేయాలన్నటువంటి విషయం మీద ప్రతి ఒక్కరు అధ్యయనం చేయవలసిన విషయం ఎంతయినా ఉంది. ఏది ఎలా అయినా మాధవరెడ్డిగారు శాంతియుతమైన వాతావరణం కోసం ప్రయత్నం చేశారు తప్ప వ్యక్తిగతంగా ఎప్పుడూ కూడా చిరునవ్వుతో, ఆప్యాయంగా, ప్రతి ఒక్కరితో స్నేహంగా మెలగాలన్న ఆలోచనతో ఉన్న వ్యక్తి. అటువంటి శాంతియుత స్వేచ్ఛా జీవనం కోసం చేసిన ప్రయత్నంలో ఆయన జీవితాన్ని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం.

నేను ఈ సందర్భంగా ఒక విషయం చెబుదామనుకుంటున్నాను. వైజాగ్‌నుంచి శ్రీకాకుళం బస్‌లో వెళుతున్నాను. ఇద్దరు నక్సలైట్లను ఇద్దరు పోలీసులు అరెస్టుచేసి తీసుకువెళుతున్నారు. నేను వారు అందరమూ ఒకే బస్‌లో నాన్‌స్టాప్‌గా రెండు గంటలు ప్రయాణం చేశాము. ఆ రెండు గంటల ప్రయాణంలో మేము మాట్లాడుకోవడం జరిగింది. ఒకరికొకరం ఏమాత్రం దాపరికం లేకుండా, కోపం లేకుండా మాట్లాడుకోవడం జరిగింది. పోలీసులు, నక్సలైట్లు, నేను కూడా రెండు గంటలు వైజాగ్ నుంచి శ్రీకాకుళం వరకు నాన్‌స్టాప్ బస్‌లో ప్రయాణం చేస్తూ అటువంటి సందర్భంలో ప్రతి ఒక్కరం ఇందులో ఒకరి మీద ఒకరికి ఏమాత్రం కోపం గానీ ఏమీ లేదు. అటువంటప్పుడు ఎందుకోసం ఈ హింసా కాండ? ఎందుకోసం హింసావాదంతో ముందుకు వెళుతున్నామో అర్థం కాని విషయం అని చెప్పి నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అందరమూ స్నేహంగా ఉన్నప్పుడు ఏదయినా మంచి రిజల్ట్ తీసుకువస్తుంది. ఈనాడు ఏనిహిలేషన్ అన్నది చాలా ప్రమాదకర మైన విషయం. కాబట్టి ఏ యొక్క ఇజమ్ కూడా ఏనిహిలేషన్ ఉండేటప్పుడు దానిని ఏ మాత్రం కూడ సహించలేము అన్నది నాయొక్క భావన అని చెప్పి ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. సామాజిక పరిణామంలో ముందుకు వెళ్ళేటప్పుడు ప్రతి ఒక్కరు కూడా ఆలోచన చేసి శాంతియుత జీవనంలో భారత దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి అన్న దానిపైన ప్రతి ఒక్కరం ప్రయత్నం చేసుకోవలసిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ఖచ్చితంగా మనకు ప్రొటెక్షన్ ఇస్తారని అనుకుంటున్నాను.

మాధవరెడ్డిగారు నన్ను అప్పలా అని పిలిచేవారు. నాకు అనిపించేది ఎవరూ కూడా నన్ను అంత చనువుగా పిలిచేవారుకాదని, అసెంబ్లీలో ఎప్పుడైనా, ఎక్కడైనా సీరియస్‌గా నేను ఆలోచిస్తుంటే ఏయ్ అప్పలా ఏం చేస్తున్నావు అనేవారు. నా మీద పర్సనల్ జోక్స్ వేసిన విషయం కూడా తమకు తెలుసు. మీరు కూడా మునిసిపల్ ఆఫీసులో నా మీద పర్సనల్ జోక్స్ వేసినప్పుడు విన్నారు. నాతో ఎంతో సన్నిహితంగా, స్నేహంగా ఉండేవారు. నా పైన ఎంతో మంచి భావనతో ఉన్న వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం. ఆయన ఆత్మకు శాంతి కలగాలనికోరుకుంటున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి (ఆళ్ళగడ్డ) :– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన మాధవరెడ్డిగారి సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా సమర్థిస్తూ మా ప్రియ సోదరుడు, మమ్ములను అందరినీ ఆప్యాయంగా పలకరించే మాధవరెడ్డిగారి గురించి ఈ విధంగా మాట్లాడే సందర్భం వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. మాధవరెడ్డిగారి గురించి ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి తెలుసు. వారు ఎంతో స్నేహశీలి. ఎప్పుడూ చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తి. ఇక ఆయన మన మధ్యన లేరు అంటే ఆ నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాము. మా రాయలసీమలో తరచు గొడవలు జరుగుతుంటాయి. మాధవరెడ్డిగారు హోం మంత్రిగా ఉన్నప్పుడు ఏ చిన్న గొడవ జరిగినా అర్థ రాత్రి సమయంలోనైనా మాకు ఫోన్ చసి మా క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ మమ్ములను

ప్రతి క్షణం అప్రమత్తం చేస్తుండే వ్యక్తి ఈ రోజు మాకు లేరన్న నిజం నమ్మలేక పోతున్నాము. మా రాయలసీమలో ప్రతి వ్యక్తిని, కార్యకర్తలను, నాయకులను అందరినీ పేరు పేరునా పేరు పెట్టి పలకరించేవారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం నిజంగా మాకు అందరికీ చాలా బాధాకరంగా ఉంది. వారు సర్పంచ్ స్థాయినుంచి క్యాబినెట్ మంత్రిగా ఈనాడు ఎన్ని ఉన్నత పదవులను అలంకరించినా ఆ పదవులకే ఒక గొప్ప అలంకారాన్ని తెచ్చిన వ్యక్తి మాధవరెడ్డిగారు. ఆయన అంత ఉన్నత స్థానానికి రావడానికి కారణం ఆయన కలుపుగోలు తనం. అందరినీ ఆయన పలకరించే తీరు అని తెలియచేసుకుంటున్నాను. కేవలం తుపాకుల ద్వారా అనుకున్నది సాధించగలం అన్న వార్ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాను. వారి సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డిగారు మా ప్రాంత వాసులే. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేసుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యాలను ఇచ్చి వారిని క్షేమంగా కాపాడాలని భగవంతుడిని కోరుకుంటున్నాను. నిరంజన్ కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియచేస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

11.00 ఉ.

శ్రీ కె. జానారెడ్డి (చలకుర్తి):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మాధవరెడ్డిగారి అకాల మరణానికి నా బాధను వ్యక్తం చేయడంతోబాటు ఈ ఆటవిక, అనాగరిక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. ముఖ్యంగా చాలా మంది చాలా విషయాలు చెప్పారు. కానీ నేను కొద్ది మాటల్లో నాకు, వారికి మధ్య వున్న అవినాభావ సంబంధం, సన్నిహితత్వం గురించి ఈ సందర్భంగా నాకు నేను గుర్తు చేసుకోవడంతోబాటు మా ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం వుండేదో గుర్తు చేయడానికి అవకాశం వచ్చింది. 1981వ సంవత్సరంలో నేను, మాధవరెడ్డిగారు సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్‌లో కొనసాగుతూ ఆ రోజు వారు పాలకపక్షంలో నేను ప్రతి పక్షంలో వున్నాము. కాకతాళీయంగా ఈ రోజు కూడా వారు పాలకపక్షంలో నేను ప్రతిపక్షంలో వున్నాము. అయినప్పటికి పక్షాలు వేరు అయినా ఆత్మీయతా, అనుబంధం విడదీయరానిదిగా వున్న సంఘటన. దానికి ఒకటి గుర్తు చేస్తున్నాను. 1983వ సంవత్సరంలో నేను తెలుగుదేశం పార్టీ ఎన్.టి.రామారావుగారి నాయకత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత వారు నాతోబాటు వుండాలనే తపన వ్యక్తపరచినప్పుడు, అనేకమంది యువకులను ఒక వేదిక మీదకు తెచ్చి రాష్ట్రంలో ఒక మార్పుకు కృషి చేయాలనే తాపత్రయంతో తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఆనాడు ఎన్.టి. రామారావుగారికి తప్పనిసరిగా ఆ పార్టీలోకి చేర్చుకోడానికి అనేక నిబంధనలు వున్నా, సమితి అధ్యక్షులను ఎంపిక చేసుకోడానికి వీలులేదు, అన్నా కూడా వారిని ఒప్పించి నచ్చచెప్పి మొదట సమితి అధ్యక్షునిగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించి చేర్పించిన విషయాన్ని గుర్తు చేశాను. ఎందుకంటే ఆ విధంగా మా కృషి దానితోబాటు మా సన్నిహితత్వం, ఇంతమంది మిత్రుల ఆత్మీయతతో రాష్ట్రంలో ఒక ఆప్తమిత్రుడిని పోగొట్టుకున్న సందర్భంగా రాష్ట్రం అంతా వారి గురించి అనుకుంటున్న ఈ సందర్భంలో నేను గర్విస్తున్నాను. ఆ తరువాత ఆరు లేదా ఏడు సంవత్సరాలు సన్నిహితుడిగా, ఆప్త మిత్రుడిగా అనుక్షణం ఎక్కడకు వెళ్లినా, ఏ కార్యక్రమం చేపట్టినా నన్ను విడవకుండా అనేక కార్యక్రమాలను ఈ రాష్ట్రంలో నిర్వహించడానికి అవకాశం ఇచ్చారు. అంతేకాదు నా

తరువాత ఈ పార్టీలో మంత్రి పదవి చేపట్టవలసిన అవసరం నీకు వున్నదని కాకతాళీయంగానో లేక భవిష్యత్తు యొక్క విధానంతోనో అంటూ వుండేవాడిని. అదే ప్రకారంగా నా తరువాత మంత్రిగా స్థానం అలంకరించి మేము వదిలిపెట్టిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేయడానికి అలాగే నల్గొండ జిల్లాకు మేము ఆశించిన ఎన్నో కార్యక్రమాలను పూర్తి చేయడానికి వారికి అవకాశం వచ్చింది. అందుకు మేము గర్వించాము. కానీ నేడు అనుకోకుండా దుస్సంఘటన జరిగి అకాల మృత్యువుపాలు కావడం బాధాకరమైన విషయం. ఇప్పుడే చాలా మంది మిత్రులు చెప్పినట్లు మరణం సహజమయినప్పటికి జరిగిన సంఘటన కానీ, వున్న పరిస్థితులు కానీ చాలా ఆలోచించదగ్గవి. అందుకు ఇంకోమాట నేను అనుకుంటున్నాను. వివిధ మంత్రిత్వశాఖలు నిర్వహించినా, అభివృద్ధికి మూలమైన పంచాయతీరాజ్ శాఖను అవసరమైన సమయంలో నిర్వహిస్తున్నందులకు సంతోషపడడమే కాదు. ఈ శాఖను నేను నాడు పూర్తిగా అయిదు సంవత్సరాలు నిర్వహించాలని అనుకున్న నాకు ఆ అవకాశం కలిగినప్పటికి అయిదు నెలలు మాత్రమే పంచాయతీరాజ్ శాఖను నిర్వహించాను. 1985వ సంవత్సరం అక్టోబర్ నెల నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించాను. ఈ శాఖకు మరల మా జిల్లా వైపు నుంచి నా మిత్రుడు, సన్నిహితుడు నిర్వహించి అభివృద్ధికే కాదు, దానికి ప్రతిష్ఠ తేవాలని ఆశించినా ఆయన కూడా ఈ శాఖను అయిదు నెలలు మాత్రమే నిర్వహించడం అనేది చాలా బాధాకరమైనది. ఏది ఏమయినప్పటికి మిత్రులందరు తీవ్రవాదం గురించి చర్చ చేస్తున్నారు. మాధవరెడ్డి ఒక వ్యక్తిగా, ఒక మిత్రుడిగా, అప్పుడిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలకు విఘ్నం కలిగినందులకు ఒక ప్రక్కన బాధ, ఇంకో ప్రక్కన ఆ తీరని లోటును పూర్తి చేయలేము అనే ఒక హృదయ విదారక పరిస్థితులు ఇలా ఎన్నో వున్నాయి. ఇంకో ప్రక్కన ఈ హత్య ప్రభుత్వానికి హెచ్చరిక. సమాజానికి కూడా హెచ్చరిక. ఈ పరిస్థితులలో తీవ్రవాద సమస్యపైన ప్రభుత్వం, అలాగే అన్ని పక్షాలు ఆలోచించవలసిన అవసరం ఎంతయినా వున్నదనేది గుర్తు చేసుకోవాలి. తీవ్రవాదం ద్వారా మారిన ఈ పరిస్థితులలో రాజ్య స్థాపన కానీ, లేక ప్రజా సంక్షేమాన్ని కానీ, అభివృద్ధిని కానీ సాధించలేము అనే అంశాలు అనేకమంది మిత్రులు చెప్పినట్లుగానే ఎప్పుడో వందల సంవత్సరాల క్రితం ఆటవికంగా తయారు అయిన ఈ పద్ధతుల ద్వారా సమాజాన్ని సముద్ధరించలేము అనే అంశాన్ని తీవ్రవాదులు గుర్తుంచుకోవాలి. 1948వ సంవత్సరంలో సాయుధపోరాటం ద్వారా ఇటు రాష్ట్రంలో, దేశంలో కూడా రాజ్యాన్ని స్థాపించాలనుకున్న కమ్యూనిస్టులు ప్రాయశ్చిత్తపడిన పరిస్థితి దాని గుణ పాఠంగా ఆ తరువాత ప్రజా జీవనంలో ప్రజాస్వామ్యయుతంగా నడిపిస్తున్న అభివృద్ధిని గురించి తీవ్రవాదులు ఈనాడు గుర్తు చేసుకోవాలి. అంతేకాదు తీవ్రవాదం ద్వారా, లేక హింస ద్వారా సమాజాన్ని బాగుపరచలేమనే విషయాన్ని వాళ్లు గుర్తు చేసుకోవాలని చెబుతున్నాను. ఆ భాగంగా వాళ్ల అవగాహనకు అవసరమైన శోధన చేయడానికి ప్రయత్నం చేయాలి. సమాజం పట్ల వారికి వున్న ఆవేదన ఏమిటో మనం కూడా అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం కూడా జన జీవన స్రవంతిలోకి వారిని తీసుకురావడానికి అవసరమైన మార్గాన్ని, ఆలోచనా విధానాన్ని అన్వేషించాలని, అదేవిధంగా మా పక్షాన

కానీ వ్యక్తిగతంగా కానీ ఆ పరిస్థితులను మార్పు చేయడానికి, తీవ్రవాదులు జన జీవన స్రవంతిలోకి రావడానికి ఆలోచింప చేయడంలో కార్యక్రమాలు నిర్వహించాలని నేను కోరుకుంటున్నాను. అనేక విషయాలు తెలియజేయడానికి యిది సందర్భం కాదు. అఖిలపక్ష
11.10 ఉ. పార్టీ ప్రతినిధులతో లేదా మేధావులతో ప్రభుత్వం తరచూ చర్చించి, ఈ యొక్క తీవ్రవాదం ఆంధ్రరాష్ట్రంలో లేకుండా చేయడం కోసం అవసరమైన చర్యలను ప్రభుత్వం గైకొనాలని, అందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్వర్తించాలని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. మిత్రుడు, అప్పుడు అయినట్టి శ్రీ మాధవరెడ్డిగారికి నివాళులర్పిస్తూ, ఆయనకు ఆత్మశాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయనతోబాటు విధి నిర్వహణలో మరణించిన సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి, కారు డ్రైవర్ నిరంజన్, వీరిరువురి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సజ్జల చంద్రమోహన రెడ్డి:- అధ్యక్షా, మాధవరెడ్డిగారి హత్య చాలా ఘోరమైంది. ఆయన వ్యక్తిత్వాన్ని గురించి అనేక పార్టీలవారు చెప్పారు. ఒక్కమాటలో చెప్పాలంటే, 'ఎఫెక్షన్, ఎటాచ్‌మెంట్, ఎఫినిటీ' అంటే అర్థం తెలిసిన వ్యక్తి ఆయన. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు జిల్లా రాజకీయాలను వారు చూసేవారు. అప్పుడు వారితో మాకు సంబంధాలు ఎక్కువగా వుండేవి వారి దుర్మరణం మేము జీర్ణించుకోలేకుండా వున్నాము.

ఈనాడు తీవ్రవాదుల యొక్క లక్ష్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి వుంది. ఒక్కొక్కరుగా మంచి వ్యక్తులను నక్సలైట్స్ పొట్టన పెట్టుకుంటున్నారు. వారు ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది. మొన్న శ్రీపాదరావుగారిని, నిన్న పురుషోత్తమరావుగారికి, ఈనాడు మాధవరెడ్డిగారిని, వీరందరినీ హత్యచేసినందుకు, అందుకు కారణమేమిటో వీరు చెప్పవలసిన అవసరం ఉంది. మేడం స్పీకర్ వారిని తమ ద్వారా ప్రశ్నిస్తున్నాను. ఈనాడు వారు ఏ పేద ప్రజలకైతే సేవ చేయాలనుకుంటున్నారో, దాన్ని ఈ విధంగా వారు సాధించగలరా అని ప్రశ్నిస్తున్నాను. నక్సలైట్స్ పేరుతో ఫేక్ నక్సలైట్స్ కోట్లాది రూపాయలను దోపిడీ చేస్తూ వుంటే, వారి ఆటకట్టించడం గురించి ఈ నక్సలైట్స్ ఆలోచించారా? పౌర హక్కులను గురించి మాట్లాడే కొంతమంది, నక్సలైట్స్ మంచి వ్యక్తులను పొట్టనపెట్టుకుంటూ వుంటే నోరు మెదపడం లేదు. ఒక రైలు పెట్టెలో దాదాపు డెబ్బది మంది పేద ప్రజలు ప్రయాణిస్తూ వుండగా, ఆ బోగీని తగులబెట్టి, వారందరినీ సజీవదహనం చేసిన ఈ నక్సలైట్స్ ఏమి సమాధానం చెబుతారు? ఈ రోజు మాఫియా గ్యాంగ్స్, ఐ.ఎస్.ఐ. ఏజెంట్స్, గూండాలు ప్రజల జీవితాలను విధ్వంసం చేయాలని ప్రయత్నిస్తూ వుంటే వారిని గురించి ఆలోచించారా అని నేను నక్సలైట్స్‌ను ప్రశ్నిస్తున్నాను.

ఈనాడు భారతదేశంలోనే అనేక రాష్ట్రాలలో కనీస సౌకర్యాలు లేని మారుమూల గ్రామాలు అనేకం వున్నాయి. కానీ ఆంధ్ర రాష్ట్ర పరిస్థితి అది కాదు. ఉన్నంతలోనే

తెలంగాణాలోని వెనుకబడిన ప్రాంతాలలో కూడా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను క్రియేట్ చేయాలని, ప్రజలకు రోడ్లు, బస్సు సౌకర్యాలను కల్పించాలని, విద్య, వైద్య వసతులను కల్పించాలని మన రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్న విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. పేద ప్రజల భాగస్వామ్యంతో, తెలంగాణాలోని మారుమూల గ్రామాలలో కూడా 'జన్మభూమి' కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తహతహలాడుతూ వుంటే, ప్రజా ప్రతినిధులు మారుమూల గ్రామాలకు కూడా వెళ్ళి ప్రజాసేవ చేస్తూవుంటే, ఈయొక్క అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం కోసం వీరు ఈ విధంగా చేయడానికి కారణం ఏమిటి అని ప్రశ్నిస్తున్నాను.

ఈనాడు వ్యక్తులను వారు – నక్సలైట్స్ – హత్య చేయగలరు కానీ ప్రజాస్వామ్యాన్ని మాత్రం అంతమొందించలేరనే విషయం మనవిచేస్తున్నాను. ఆనాడు బ్రిటిష్ వారు కొన్ని లక్షల తుపాకులతో భారత ప్రజలను కానివ్వండి, ఈ రాష్ట్ర ప్రజలను కానివ్వండి ఏమీ చేయలేకపోయారు. కేవలం కొన్ని తుపాకులతో ఈ నక్సలైట్స్ ఏమీ చేయలేరనే విషయం నేను తమద్వారా వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. నేను ఒకటే నక్సలైట్స్‌కు మనవిచేస్తున్నాను. వారు ప్రజాప్రతినిధులను పొట్టనపెట్టుకొని అందరినీ భయపెట్టాలనే ప్రయత్నం చేస్తే అది సాధ్యం కాని పని అని మనవిచేస్తున్నాను. వారు మా అందరినీ పొట్టన పెట్టుకున్నప్పటికీ మా పిల్లలు, మా కార్యకర్తలు ముందుకు రావడానికి సిద్ధంగా వున్నారు. ఎనిమిది కోట్ల ఆంధ్రులు వారి తుపాకులు చూసి వెన్నుకపోయే పిరికిపందలు కాదని నక్సలైట్స్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈయొక్క నక్సలైట్స్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. నా సూచన ఒకటే. మందుపాతర పేలడంవల్ల మాధవరెడ్డిగారు చనిపోయారు. మెటల్ సర్ఫేస్ రోడ్స్ వున్నప్పుడు, అది అప్రోచ్ రోడ్ కావడంవల్ల, ముఖ్యమంత్రిగారు కానివ్వండి, మంత్రులు, శాసనసభ్యులు కానివ్వండి రోజూ ప్రయాణిస్తూ వుంటారు. అటువంటి ముఖ్యమైన రోడ్ల విషయంలో పోలీసులు ముందుగానే ఒక కన్నువేసి వుండవలసిందని నేను భావిస్తున్నాను. ఏదిఏమైనప్పటికీ పార్టీలకు అతీతంగా అందరం కలిసి నక్సలైట్స్ చర్యలను ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నామని, అందుకు సంబంధించిన మెసేజ్ నక్సలైట్స్‌కు చేరవలసిన అవసరం వున్నది. ఈనాడు ఎనిమిది కోట్లమంది ప్రజలకు ప్రజాప్రతినిధులుగా వున్న మనం నక్సలైట్స్ తుపాకులకు భయపడితే ప్రజలకు న్యాయం చేకూర్చలేమనే విషయం మనవి చేస్తున్నాను. నక్సలైట్స్ చర్యలను ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నామనే విషయం కూడా మనవిచేస్తున్నాను. మా తరువాత మా కార్యకర్తలు, మా పిల్లలు కూడా మిమ్మల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగావున్నారనే విషయం మరీ మరీ మనవిచేస్తున్నాను.

శ్రీ మాధవరెడ్డిగారి మరణం పార్టీకి, ఈ రాష్ట్రానికి తీరని లోటని మనవిచేస్తున్నాను మాధవరెడ్డిగారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయనతోబాటు చనిపోయిన సెక్యూరిటీ ఆఫీసర్, డ్రైవర్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి. శోభనాద్రీశ్వరరావు:– మేడమ్ స్పీకర్, మా సహచరులైన మాధవరెడ్డిగారి అకాల మరణానికి సానుభూతిని తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను.

మాధవరెడ్డిగారు విలక్షణమైన వ్యక్తి. ఎప్పుడూ నవ్వుతూ వుండేవారు. పార్టీలకు అతీతంగా, చిన్న పెద్ద అందరితో కూడా ఎంతో స్నేహభావంతో మెలిగి అందరి అభిమానం చూరగొన్న వ్యక్తి. ఆయన ఏ బాధ్యత అప్పజెప్పినా అంకితభావంతో పనిచేసేవారు. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీకి ఆయన మరణం తీరని లోటు. మా కృష్ణా జిల్లాకు వారు నాలుగు సంవత్సరాలకు పైగా ఇన్‌ఛార్జి మంత్రిగా వుంటూ, మా జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. మా పార్టీ వారు మాత్రమే కాకుండా అన్ని పార్టీలకు సంబంధించిన వారు కూడా మాధవరెడ్డిగారి మరణం పట్ల తీవ్ర సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

ఇటీవల ముఖ్యమంత్రిగారు స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలను కలుగజేసి; అట్టడుగు స్థాయిలోని ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడం కోసం పరిపాలనా పరమైన అధికారాలను సమీకరింపజేసి, ఆర్థిక వనరులను చేకూర్చాలనేటటువంటి ఆలోచనలకు అనుగుణంగా కేబినెట్ సబ్ కమిటీ వేయడం జరిగింది. ఆ సబ్ కమిటీ అధ్యక్షునిగా మాధవరెడ్డిగారు రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించి చాలా చక్కటి, అమూల్యమైన రికమండేషన్స్ తయారు చేశారు. ఆ రికమండేషన్స్ తుదిరూపం సంతరించు కొని అమలు కాకముందే ఈ విధంగా వారు దారుణ హత్యకు గురికావడం అనేది మన రాష్ట్రానికే తీరని లోటు. మాధవరెడ్డిగారి హత్యోదంతం తరువాత వ్యక్తమైనటువంటి నిరసనను గమనించి అయినా సరే తీవ్రవాదులు తమ పంథాను మార్చుకుంటారని నేను ఆశిస్తున్నాను. చాలా దురదృష్టకరమైనటువంటి, ఏనాడో కాలం చెల్లినటువంటి బూజు పట్టిన సిద్ధాంతాలను వారు ఈనాటికి కూడా పట్టుకొని వ్రేలాడుతూ ప్రజలకు ఎన్నో సేవలను అందజేసిన వ్యక్తులను, సమాజాభివృద్ధి కావించిన వ్యక్తులను పొట్టనపెట్టు కోవడం శోచనీయం. శ్రీపాదరావుగారు, పురుషోత్తమరావుగారు, మాధవరెడ్డిగారు మొదలైన వ్యక్తులను చంపడం ద్వారా వారు సాధించగలిగింది ఏమిటో అర్థం కాదు.

నాకు చాలా బాధకలిగించే విషయం ఏమంటే నక్సలైట్లు వాస్తవాలను గమనించకుండా వారు కేవలం ఒక మూర్ఖమైన పంథాలో ప్రయాణిస్తున్నారు. గత డెబ్బది సంవత్సరాలుగా వారు కోరుకునేటటువంటి ఒక వ్యవస్థ వున్నటువంటి దేశంలో చిట్టచివరకు కేవలం చిన్న బ్రెడ్ కోసం ప్రజలు కొట్లాడుకునేటటువంటి పరిస్థితులు ఏర్పడడం, కొన్ని దురదృష్టకర మైన సంఘటనలు జరగడం మనం చూశాము. అక్కడ వారి వ్యవస్థ పేకమేడలా కుప్ప కూలిపోయింది. ఈ రోజు కూడా పాశ్చాత్య దేశాల నుండి, అభివృద్ధి చెందిన దేశాల నుండి కొన్ని లక్షల కోట్ల డాలర్లను పెట్టుబడులుగా తెచ్చుకుంటూ ఆర్థికాభివృద్ధిని సాధించడం

11·20 ఉ· కోసం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం కోసం కృషి చేస్తున్నారు. ఇక్కడ తుపాకుల గొట్టం ద్వారా రాజ్యాధికారం వస్తుందనేటటువంటి తుచ్ఛ ఆలోచన, పిచ్చి వ్యూహం ఇంకా వారికి ఉండటం దురదృష్టకరమైన విషయం. ఈ ప్రపంచంలో అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థే పేదవాడికిగాని, బలహీనుడికి కాని మెరుగైన న్యాయం కలుగచేస్తుంది అని అందరూ ఆమోదించినటువంటి నగ్నసత్యం. ప్రజాస్వామ్యం ద్వారానే ప్రజల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలవుతుందని చరిత్ర చెపుతున్నటువంటి నగ్న సత్యం. దానిని మనం మరచిపోకూడదు. ముఖ్యంగా మన రాష్ట్రంలో చంద్రబాబునాయుడి గారి ఆధ్వర్యంలో ఈ రోజున, నక్సల్స్ ఏ పేద ప్రజల్ని ఉద్ధరించాలనుకొంటున్నారో, ఏ ప్రజల్ని ఉద్ధరించాలనుకొంటున్నారో ఏ బలహీనుల్ని, పేదల్ని ఉద్ధరించాలనుకొంటున్నారో అదే ప్రజల కోసం, అదే బలహీనుల కోసం ఈ రోజున ముఖ్యమంత్రి జన్మభూమి, శ్రమదానం, ప్రజల వద్దకు పాలన, వాటర్ యూజర్స్ అసోసియేషన్స్, మదర్స్ కమిటీలు, ఎడ్యుకేషన్ కమిటీలు వేసి, అందులో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ, ప్రజలకే అధికారం ఇచ్చి, వారి యొక్క అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సందర్భంలో, వారు (నక్సల్స్) కూడ ప్రజల వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు, వారిని చైతన్యవంతుల్ని చేసేందుకు వివిధ సూచనలు చేసి ఆ విధంగా ముందుకు వచ్చే పంథాన్ని అనుసరించాలని కోరుతున్నాను. ఇందాక మిత్రులు చెప్పారు – స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడ మొట్టమొదట్లో ఇంకా ప్రజలకు, ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని చెప్పి ఆనాడు సాయుధ పోరాటాలు చేసి కొన్ని వేల మంది వ్యక్తుల్ని ఆ రోజున కమ్యూనిస్టు పార్టీ కోల్పోవడం జరిగింది. అందులో కూడ అంకిత భావంతో పనిచేసి, ప్రాణాలు పోగొట్టుకున్న వారు కూడ కొంత మంది ఉంటారు. అటువంటి వారిని కూడ ఆ పార్టీ ఈనాడు కోల్పోయింది.

ఈ రోజున నక్సలిజం పేరుతో అందులో రకరకాల మనుష్యులు చేరిపోయారు. మొదట్లో పశ్చిమ బెంగాల్‌లో నక్సల్‌బరి ఉద్యమం ప్రారంభమైన సందర్భంలో చాల మంది అంకితభావంతో సామాజికంగా వెనుకబడిన ప్రజల సముద్ధరణ కొరకు పాటుపడినా, చిట్ట చివరకు ఈ రోజున ఆ ఉద్యమంలో రకరకాలైన మనుష్యులు, రకరకాల ఆలోచనలతో, డబ్బు సంపాదించడానికి, వారి మనస్సులోని భావాల్ని నెరవేర్చుకొంటూ ఉన్నారు. అయితే నక్సలిజం పేరుతో ఇతరులు కూడా ఇందులో చేరుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వారి యొక్క పంథాను మార్చుకొని, ఈ జనజీవన స్రవంతిలో చేరి, పేద ప్రజల సముద్ధరణ కోసం, వారి అభివృద్ధి కోసం ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న కృషిలో వాళ్ళు కూడ భాగస్వాములు కావాలని మీ ద్వారా ఈ సభ ద్వారా వారికి విజ్ఞప్తి చేస్తూ, మాధవరెడ్డిగారి జ్ఞాపకాలు చిరస్థాయిగా ప్రజలు గుర్తించుకొనే విధంగా, ప్రజల మధ్య వారు ఉండే విధంగా ముఖ్యమంత్రిగారు అనేక నిర్ణయాలు ప్రకటించినందుకు, వారిని అభినందిస్తూ, మాధవరెడ్డిగారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, అట్లాగే వారితోపాటు మరణించిన, మంత్రిని ఎన్నడూ కంటికి రెప్పలా కాపాడుతూ ఉన్న రాంభూపాల్‌రెడ్డి మరియు డ్రైవర్ నిరంజన్‌ల మృతిపట్ల కూడ నా హృదయపూర్వక సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు కూడ నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. అదే సందర్భంలో నేను అనేక పౌర హక్కుల సంఘాల వారిని ప్రశ్నిస్తున్నాను. ఎప్పుడైన తీవ్రవాదులు ఏదైన ఎన్‌కౌంటర్‌లోగాని, మరొక రూపంలో కాని చనిపోతే, పౌర హక్కుల సంఘాలు చాల

విమర్శలు చేస్తూ ఉంటారు. చాల అల్లరి చేస్తూ ఉంటారు. అదే తీవ్రవాదుల చేతిలో పేద వాళ్ళు అమాయకులైన వారిని నిష్కారణంగా చంపినప్పుడు, అలా చంపడం తప్పు, పొరపాటు మీరు ఎందుకు అలా చేశారు అని ఖండించిన పరిస్థితి ఏనాడు లేదు. చదువుకున్న వాళ్ళు, మేధావులు, లీడర్లుగా ఉన్నవారు ఈ రకమైన డబుల్ స్టాండర్డ్స్‌ను అనుసరించడం ఖండించదగ్గ విషయం. వారు కూడ ఇటువంటి పంథాను మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

శ్రీ టి. సీతారామ్:– అధ్యక్షా, మాధవరెడ్డిగారి అకాల మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

ఈవేళ మాధవరెడ్డిగారి మరణం ఒక్క మాధవరెడ్డిగారి మరణం అని అనుకొంటూ అది పొరపాటు అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థకే విసిరిన ఒక సవాలు అని తమరి ద్వారా మనవి చేసుకుంటున్నాను. ఎందరో మహానుభావుల త్యాగఫలితంగా ఈనాడు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని నిలబెట్టుకొంటున్నాం. ఈవేళ దానిని నిలబెట్టుకోవాలా లేదా అనే ప్రశ్న మన ముందు ఉంది. ఇలాంటి పరిస్థితిలో పాలకులు, ప్రజలు ముఖ్యంగా అతి పిరికి పందలు కాకూడదు. ఎన్నో త్యాగాల ఫలితంగా సంపాదించుకున్న ఈ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి అవసరం అయితే మరిన్ని త్యాగాలు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈనాటి ఈ సంఘటన కేవలం మాధవరెడ్డికి సంబంధించినది అనుకొంటే సరికాదు. ఇది మొత్తం వ్యవస్థ మీదే విసిరిన ఒక పెను సవాలు. దీనిని ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నాం. ఎట్టి పరిస్థితులలోనూ కూడ పిరికి పందలుగా వ్యవహరించడానికి కాని, ఇంకొక విధంగా ఆలోచించడానికి కాని తావు ఇవ్వడానికి వీలు లేని పరిస్థితి అని తమరి ద్వారా మనవి చేసుకొంటున్నాను.

ఇక మాధవరెడ్డిగారి విషయం వచ్చేటప్పటికి, వాళ్ళ రెండవ పాప మ్యారేజ్ సెటిల్ అయిందని ఇక్కడే మన అసెంబ్లీలో చెప్పినప్పుడు, 19, 20 సంవత్సరాల వయస్సు అంటున్నారు, ఎందుకు అప్పుడే మ్యారేజ్ చేస్తున్నారు అని అడిగాను. మంచి మ్యాచ్ వచ్చింది, మనకు అవకాశం ఉన్నప్పుడే, మంచి సంబంధాలు వచ్చినప్పుడే చేయాలి, ఎప్పుడు ఎట్లా ఉంటుందో తెలియదు అని ఆయన చెప్పడం జరిగింది. అయితే ఈ సంఘటన జరిగిన తరువాత నేను అర్థం చేసుకున్నాను – బహుశా, ఆయన టార్గెట్‌లో ఉన్నాను అనే విషయం ఆయనకు ముందే తెలుసునని. తన విధి నిర్వహణలో ఏ రోజు కూడ రాజీ పడకుండా వ్యవహరించారని మీకు తెలియచేసుకొంటున్నాను. ఈనాడు మాధవరెడ్డిగారు ఎందుకోసం చనిపోయారు? ఎవరి కోసం మరణించారు? ఏ కారణం కోసం చనిపోయారు అనే విషయాల మీద చర్చ జరగవలసిన అవసరం ఉంది. ఈనాడు పౌరుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకొనే పౌర హక్కుల సంస్థలు, సంఘాలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా తమ వైఖరిని మార్చుకుంటూ మాట్లాడడం మంచి పద్ధతి కాదు. మాధవరెడ్డిగారి మరణం గురించి ఈ రోజున చర్చ జరిపేందుకు ఒక వేదిక వేయాలి. ఈ విషయంలో ప్రజల్ని కూడ చైతన్యవంతుల్ని చేయవలసిన అవసరం ఉంది.

ఈనాడు మాధవరెడ్డి ఏ తప్పు చేశారు? ఆయన హత్య విషయమై చర్చ జరగాలి. ఈ రోజున తీవ్రవాద సంస్థలు కూడ తమ సిద్ధాంతాలేమిటో చెప్పాలి. మొన్న శ్రీపాదరావు, నిన్న పురుషోత్తమరావు, ఈ రోజు మాధవరెడ్డి, రేపు ఎవరైన కావచ్చు. మంచి వ్యక్తుల్ని, ప్రజలకు పనికి వచ్చే వ్యక్తుల్ని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, వారి సంక్షేమం కోసం రాజీలేని పద్ధతిలో పనిచేస్తున్న వారిని పొట్టన పెట్టుకోవడంలో అర్థం ఏమిటో వారు చెప్పవలసిన అవసరం ఉంది. వారికి కూడ ఒక ఫిలాసఫీ ఉంటే, వారు కూడ ప్రజల ముందుకు రావాలి. వాళ్ళ సిద్ధాంతాలేమిటో చెప్పాలి. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలు తమ తమ సిద్ధాంతలేమిటో, తమ ప్రజాశికలేమిటో, చెపుతూ మ్యానిఫెస్టోలు ఇస్తున్నాం. వాటిని చూసి ప్రజలు నిర్ణయించుకుంటున్నారు, ఓట్లు వేస్తున్నారు, అధికారంలోకి వస్తున్నాం. కాబట్టి వారు కూడ అదే పంథాలో ముందుకు రావాలి. వారి సిద్ధాంతం ఏమిటో చెప్పాలి. చెప్పి, జనాన్ని ఒప్పించాలి, అధికారాన్ని చేజిక్కించుకోవాలి. అంతేతప్ప, కేవలం తుపాకుల గొట్టాల ద్వారా రాజ్యాధికారం స్వీకరిస్తామంటే అది జరగని పని. చరిత్ర క్రమాన్ని, చరిత్ర పరిణామాల్ని గమనిస్తే అది గతంలో ఎన్నడూ జరగలేదు, ఇప్పుడు జరగలేదు, రేపు జరగదు. ఎన్నటికీ జరగదు. సూర్య చంద్రాదులు ఉన్నంత కాలం ప్రజాస్వామ్యమే గెలుస్తుంది తప్ప, తీవ్రవాదం ఏనాడు గెలవదు. కాబట్టి దానిని గ్రహించవలసిన అవసరం ఉంది. కాబట్టి దీనిని గర్హించాల్సిన
11-30 ఉ. అవసరం, దీని మీద వారు అంతర్మథనం చేసుకుని, తాము చర్చించుకోవలసిన అవసరం ఉంది. మరి వారి ఫిలాసఫీ ప్రజలకు చెప్పమనండి. ఈనాడు ప్రభుత్వాన్ని పౌర హక్కుల పేరుతో ప్రశ్నిస్తున్న వారు ఓపెన్ డిబేట్ జరపాల్సిన అవసరం ఉంది. ఎట్టి పరిస్థితులలోనూ ఒక వ్యక్తిని కాల్చి చంపగలరు గానీ, వ్యవస్థను కాల్చి చంపలేరు. దానికి చావు లేదు. మరణం లేదు. వ్యవస్థను ఆ క్రమంలో ఆమోదించి సమాజం తన గర్భంలో దాచుకుంది. ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరూ అంగీకరించరు. దీని మీద థరో డిబేట్ జరగాల్సిన అవసరం ఉంది. మన కోసం, ఈ దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్యం కోసం గతంలో చేసిన త్యాగాలను మనం నిలబెట్టుకోవాలి. దానిని గురించి ఆలోచించు కోవాల్సిన అవసరం ఉంది. అవసరమైతే మరిన్ని త్యాగాలకు సిద్ధం కావాలి. దానిని రక్షించుకోవాలి. ఒక వ్యక్తి మరణం దీనిని ఎట్టి పరిస్థితులలోనూ నివారించలేదు.

నేను ఒకటి మనవిచేస్తున్నాను. రేపు 18వ తేదీన నా నియోజకవర్గానికి మాధవరెడ్డిగారు వచ్చే ప్రోగ్రాం ఉంది. లక్ష్మణరసుపేటను అదనపు మండలంగా యిచ్చేటప్పుడు దానిని వారు ప్రారంభోత్సవం చేయడానికి రావాల్సి ఉంది. కాని ఈ రోజు 17వ తేదీన వారి పేరిట సంతాప తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. అలాగే ఒకటి మనవిచేస్తున్నాను. ఆయన నీలి ఆకాశంలో తళుక్కుమనే మెరుపు. వారి జీవితం అలా గుర్తుకు వస్తుంది. నిన్నటి వరకూ మన మధ్య తిరిగారు. మొన్నటి శాసనసభలో గాని, పార్టీలోగాని, క్యాబినెట్‌లో గాని వారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే తెలుగుదేశం మంచి ముత్యాల హారం నుంచి ఒక కొలికి పూస రాలి పోయిందని గౌరవసభ్యులకు మనవి చేసుకుంటున్నాను. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిజేస్తూ, అలాగే వారి రక్షణ కోసం అనునిత్యం వెంట ఉంటూ

ప్రాణత్యాగం చేసిన శ్రీ రాంభూపాల్‌రెడ్డి, డ్రైవరు నిరంజన్‌గార్లకి ఆత్మశాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మంచి జరగాలని, వారు లేని లోటును భగవంతుడు తీర్చాలని కోరుతూ ఈ అవకాశం యిచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను

డా. కె. లక్ష్మణ్ (ముషీరాబాద్) :- మేడమ్ స్పీకర్, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మాధవరెడ్డిగారు బి.ఇ. పట్టా పుచ్చుకున్నాక వారికెన్నో అవకాశాలున్నప్పటికీ ఉద్యోగం కోసం గాని, తాను చదువుకున్న విద్య ద్వారా విదేశాలలో స్థిరపడే అనేక అవకాశాలున్నప్పటికీ వారు ప్రజాసేవనే ఎన్నుకుని, రాజకీయాన్ని ఒక వృత్తిగా కాకుండా ఒక ప్రవృత్తిగా తీసుకున్నారు. ఒక మిషన్‌గా ఎంచుకుని సర్పంచ్ స్థాయి నుంచి ప్రజాసేవ చేయాలనే దృక్పథంతో వచ్చారు. ఆ విధంగా అంచెలంచెలుగా సర్పంచ్ స్థాయి నుంచి సమితి అధ్యక్షులుగా ఎదిగి, 1985లోను, 89లోను, 94లోనూ, 99లోనూ ఎన్నికై ఏనాడు ఓటమి ఎరుగకుండా అందరి ప్రజల మన్ననలను పొందుతూ సమాజంలో అన్ని వర్గాల ఆమోదాన్ని సమర్థవంతంగా పొందుతూ ఏకతాటిపై నడిపేరనడానికి వారు క్రమంగా ఎన్నిక అవుతూ ఉండటమే నిదర్శనం. వారు హోం మినిస్టరుగాగాని, వైద్య ఆరోగ్యశాఖమంత్రిగా గాని, యిటీవల పంచాయతీరాజ్ శాఖామంత్రిగాగాని సమర్థవంతంగా విధులను నిర్వహించారు. ఆనాడు మాధవరెడ్డిగారు హోం మంత్రిగా ఉన్నపుడు నగరంలో అనేక పర్యాయాలు అల్లర్లు జరిగినా, మత కలహాలు జరిగినా వారు మాతో ఎంతో సన్నిహితంగా పాతపట్టణంలో అణచివేయడానికి చూపిన సమర్థత, నిర్వహించిన పాత్ర ఈ రోజు కూడా నగర ప్రజలు మరచిపోరు. ఆ విధంగా వారు, ముఖ్యంగా నల్గొండ జిల్లాకు కూడా విశేషంగా అభివృద్ధిని చేకూరుస్తూ, యిటీవల యాదృచ్ఛికంగా వచ్చిన మునిసిపల్ ఎన్నికలలో మా పార్టీ తరఫున పరిశీలకులుగా వెళ్ళినపుడు వారితో ఎంతో సన్నిహితంగా దాదాపు నాలుగైదు రోజులు కలిసి ప్రచారం చేసే అవకాశం కలిగింది నాకు. మొదటి రోజు హైదరాబాదు నుంచి వారు, నేను, మా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారెడ్డిగారు వారి వ్యానులో ప్రయాణం చేస్తున్నపుడు చౌటుప్పల్‌కు వెళ్ళే దారిలో ప్రజలు గుర్తించి, నిలబడి, మాధవరెడ్డిగారికి నమస్కరించడం చూశాము. ప్రతి గ్రామంలో వారిని ప్రజలు గుర్తించి ఆదరణ చూపిన సంఘటనలను వారు ప్రస్తావిస్తూ తాను నల్గొండ జిల్లాలో, జన్మభూమి సందర్భంగా 50 మండలాలను పర్యటించానని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే ప్రజలలో ఆదరణ పెరుగుతుందని వారు ప్రస్తావించారు. ఆ విధంగా ఏ మాత్రం జంకు లేకుండా నిర్భయంగా, నిస్సంకోచంగా ప్రైవేటు వ్యానులో వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఎందరినో ఆశ్చర్య చకితులను చేసింది.

సూర్యాపేటలో ఎన్నికల ప్రచారానికి నేను వెళ్ళినప్పుడు అదే రోజు అక్కడ ఈశ్వరీయ బ్రహ్మ కుమారీ జ్యోతి రథయాత్ర జరిగింది. అదేరోజు కాకతాళీయంగా మంత్రిగారు పట్టణానికి వచ్చారు కదా అని వారిని తమ చేతులతో స్వాగతం చెప్పాలని కోరడంతో, వారు అంగీకరించి స్వాగతం చెబుతున్న సందర్భంలో ఆ కార్యక్రమం గురించి మాట్లాడుతున్న అక్కడి సంస్థలోని అక్కయ్యలుగా పిలువబడే వారు ఒక కరపత్రాన్ని మాధవరెడ్డిగారికి యిచ్చేరు. సహజంగా మానవునికి ఉండే అవలక్షణాలలో ఏదైనా ఒకదానిని మా సంస్థకు

దానంగా యివ్వాలని కోరినప్పుడు, ఆ కరపత్రాన్ని వారు పూర్తిగా చూసి, మానవునకు సహజంగా ఉండే ఈర్ష్య, అసూయ, కామం, క్రోధం వంటి అవలక్షణాలను దానం చేయాలని కోరినపుడు, నాలో ఈ అవలక్షణాలేవీ ఉన్న భావన కలగడం లేదు. ఏది దానం చేయాలి? నాలో ఈ బలహీనతలు ఏవీ లేవని భావిస్తున్నాను, కాని నాకు తెలియకుండా నాలో ఈ బలహీనతలేవైనా ఉంటే వాటిని దానంగా తీసుకోమని వారు కోరడం మరపురాని సంఘటనగా భావిస్తున్నాను.

సమాజంలో బలహీనవర్గాల వారి సేవచేస్తూ, ప్రజా ప్రతినిధులుగా చెలామణీ అవుతున్న వీరిని 7వ తేదీ రాత్రి ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత అర్థరాత్రి చంపేరని ఈటీవీ ద్వారా సమాచారం తెలిసి చాలా ఆశ్చర్యం కలిగింది. ఒకరోజు ముందు మాతో కలిసి,
11.40 ఉ. ప్రతివీధిలో, ప్రతిగల్లీలో పాదయాత్ర చేసి, ఏ మాత్రం జంకుగొంకు లేకుండా, మంత్రి అనే విషయాన్ని కూడా ప్రక్కకుపెట్టి ఎన్నికలలో వారు మాతో తిరగడం జరిగింది. ఈ వార్త తెలిసిన తరువాత మేము ఎంతో ఆందోళన చెందడమే కాకుండా కోలుకోడానికి కూడా చాలా సమయం పట్టింది. మరుసటి రోజు ఉదయం వెళ్ళి ఆ కార్యక్రమంలో పాల్గొన్నాము. ఈ రోజు సమాజంలో ప్రజాస్వామ్యం కొనసాగాలంటే ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేని విషయాన్ని తెలుసుకోవడం అవసరం. తీవ్రవాదం అనేక రూపాలలో ఈనాడు తీవ్రవాద రూపం, మతోన్మాద రూపం, ఫ్యాక్షనిజం రూపంలో గాని సమాజంలో ఏ మాత్రం ఉండడానికి వీలులేదనే విషయం రాజకీయాలకు అతీతంగా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. తీవ్రవాదాన్ని ముందుకు తీసుకొని పోతేనే సమాజంలో ఏదో సాధిస్తామనే తప్పుదోవపడుతున్నవారికి కనువిప్పు కలగాలి. మాధవరెడ్డిగారిని తొలగించినంత మాత్రాన సమస్య తొలగిపోతుందని భావించడం పొరబాటు. ఈ సమస్యను అన్ని రాజకీయపార్టీలు ఒక సవాలుగా తీసుకొని సమాజంలో వున్న ఆర్థిక ఆర్థిక, సామాజిక అసమానతలు హింస ద్వారా ఈ సమస్య పరిష్కారం కాదని తేటతెల్లం చేయాల్సిన అవసరం ఉందని నేను భావించుతూ, వ్యక్తి నిర్మూలన ద్వారా సమస్య పరిష్కారం కాదని వ్యక్తి నిర్మాణం, వికాసం కోసం పాటుపడుతూ, ప్రజాస్వామ్యప్రియులు ముందుకు రావలసిన అవసరం ఉందనే విషయాన్ని వ్యక్తీకరించుతూ, నా తరఫున, మా పార్టీ తరఫున మాధవరెడ్డిగారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలనీ, వారితోపాటు వారి సెక్యూరిటీ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి, డ్రైవర్ నిరంజన్‌గార్ల కుటుంబాలకు కూడా భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకొంటూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి. ఇంద్రారెడ్డి (చేవెళ్ల) :- గౌరవ ముఖ్యమంత్రిగారు మాధవరెడ్డిగారి మృతి పట్ల ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మొట్టమొదటిసారిగా 1980 సంవత్సరంలో మాధవరెడ్డిగారు మేము అంతా రామారావుగారి నాయకత్వంలో శాసన సభ్యులుగా ఎన్నుకోబడి 94-95 వరకు మూడు పర్యాయాలు రామారావుగారి నాయకత్వంలో ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగాను నేను హోంమంత్రిగాను ప్రమాణస్వీకారం చేసిన తరువాత నల్గొండ జిల్లాకు మేము పర్యటనకు వెళ్ళిన సందర్భంగా అక్కడ

పిడబ్ల్యుజి వారు కరపత్రాలు విడుదల చేశారు. అందులో మాధవరెడ్డిగారు హోంమంత్రిగా నల్గొండ జిల్లాలోని అమాయకులను వేధిస్తున్నారనే, అరెస్టులు చేయిస్తున్నారనే ఆ కర పత్రాలలో ఇవ్వడం జరిగింది. అప్పుడు ఆయన ఇందిన్నా, చట్టబద్ధంగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రిగా శాంతిభద్రతలను పరిరక్షించడానికి ప్రయత్నం చేస్తున్నాను గానీ ఒక సంస్థ పట్ల, లేక ఒక వ్యక్తిపట్ల వ్యతిరేకిని కాదని రెండు రోజుల ఆ జిల్లా పర్యటన సందర్భంగా అనడం జరిగింది. పార్లమెంటు పంథాలో ప్రమాణస్వీకారం చేసిన హోం మంత్రిగా మాధవరెడ్డిగారు చట్టవిరుద్ధంగా కార్యక్రమాలు చేస్తున్న తీవ్రవాదం పైన రాజీలేని పోరాటం చేసిన ధీరుడిగా, వీరుడిగా చరిత్రలో మాధవుడు నిలుస్తాడు. సంఘ వ్యతిరేక ఉద్యమాలు అణచివేతలో మంచిస్ఫూర్తిగా నిలుస్తారని ఈ సందర్భంగా చెప్పవలసి వస్తుంది.

గౌరవ ముఖ్యమంత్రిగారికి ఈ సందర్భంగా మనవిచేసేది ఒకటి. ఆంధ్రరాష్ట్రంలో తీవ్రవాదానికి 33 సంవత్సరాల చరిత్ర వుంది. ఉత్తర తెలంగాణాలో, దక్షిణ తెలంగాణాలో ఉత్తరాంధ్రలో రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో ఇది విస్తరించింది. ఇది అనేక మంది ముఖ్యమంత్రులను చూసింది, అనేకమంది హోం మంత్రులను చూసింది, అనేకమంది డిజిపిలను చూసింది. ముఖ్యమంత్రులు వెళ్ళినా, హోంమంత్రులు వెళ్ళినా, డిజిపిలు వెళ్ళినా తీవ్రవాదం అలాగే నిలిచిపోయింది. మాధవరెడ్డిగారి హత్య జరిగిన నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రిగారు తీవ్రవాద సమస్య పట్ల మన రాష్ట్రంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నమ్మే రాజకీయపార్టీలను, ప్రజాస్వామ్య సజావుగా కొనసాగాలని కోరుకొనే పౌరహక్కుల సంఘాలను విశ్వాసంలోకి తీసుకోవలసిన తరుణం ఏర్పడింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ తీవ్రవాద సమస్యను జటిలమైన సమస్యగా చెప్పడం జరిగింది. 16 మాసాల క్రితం రాష్ట్రంలో పోలీసులకు, తీవ్రవాదులకు మధ్య జరిగిన పోరాటంలో అనేకమంది అమాయకులైన పొట్టకూటికోసం ఉద్యోగాలు వేసుకొనే పోలీసులు మరణించడం తీవ్రవాదులు మరణించడంపట్ల దీని తీవ్రతను గమనించిన కొంతమంది మేధావులు ఈ రకమయిన పంథా కొనసాగడానికి వీలులేదని రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తికి ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దానిపై ఒక తీర్పు చెప్పింది. అందులో ఒక శాంతి సంఘాన్ని ఏర్పాటుచేయాలనే, అందులో అన్ని రాజకీయ పార్టీలకు, మేధావులకు, పత్రికా సంపాదకులకు ప్రాతినిధ్యం కల్పించాలని 16 మాసాల క్రితం హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిని ఇంతవరకు గౌరవ ముఖ్యమంత్రిగారు పరిశీలించలేకపోయారు. కారణాలు తెలియదు గానీ ఇప్పుడయినా దానిని పరిశీలించి శాంతి సంఘాన్ని నియమించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ శంకరన్ పౌర సంబంధాల వేదిక తరఫున 100 సూచనలతో గౌరవ ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి రూపంగా ఇవ్వడం జరిగింది. దానిని కూడా పరిశీలించాలని కోరుతున్నాను. ప్రతాపరెడ్డి అనే సీనియర్ న్యాయవాది ఉత్తర తెలంగాణా ప్రాంతంలో ఎక్కడయితే తీవ్రవాదం ఉందో ఆ ప్రాంతాలను ఒక అధ్యయన బృందం ద్వారా పరిశీలించి ఒక నివేదికను ముఖ్యమంత్రిగారికి సమర్పించడం జరిగింది. అది కూడా పరిశీలించాలని మనవిచేస్తున్నాను. పార్లమెంటరీ ప్రజాస్వామ్యయుతమైన 50 సంవత్సరాల సుదీర్ఘ భారతదేశ వ్యవస్థలో పేదరిక నిర్మూలన, కుల వివక్ష మతవివక్ష

తీవ్రవాదం లాంటి సమస్యలకు కేవలం శాంతిభద్రతల సమస్యలుగా పరిగణించడం సమంజసం కాదు. ఇది ఎందుకు వస్తున్నది దీనికి మూలం ఏమిటి పేదరికంవల్లనా, నిరుద్యోగం వల్లనా లేక వ్యవసాయ రంగంలో మౌలికమయిన సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం కావడం వలన నిరుద్యోగులైన యువకులు ఇటువైపు ప్రయాణం చేస్తున్నారనే విషయం కూడా మనం గమనించవలసి ఉంది. వారిని మనం మెయిన్ స్ట్రీం లోకి రావాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినప్పుడు వారికి అటువంటి సౌకర్యాలు కల్పించవలసి ఉంది. ఉత్తర తెలంగాణాలో పోలీసు బలగాలను ఒకవైపు పెట్టి మరొకవైపు అనేక వత్తిళ్ళ పెట్టి వారు జనజీవన స్రవంతిలోకి రావాలన్నపుడు అది ఏ విధంగా సాధ్యమవుతుందో ముఖ్యమంత్రిగారు ఆలోచించాలి. తీవ్రవాదులు అప్రజాస్వామిక విధానంవైపు పోతున్నా కూడా ప్రభుత్వం పార్లమెంటరీ పంథాలో నడవవలసి ఉంది. వారితో సమానంగా మనం కూడా పార్లమెంటరీ పంథాకు భిన్నంగా నడవడం మంచిది కాదు. మనం కూడా ఆ విదంగా ప్రవర్తించడం సమంజసం కాదని మనవిచేస్తున్నాను. మొన్న జరిగిన కొవ్వూరు ఎన్‌కౌంటర్ ఫేక్ ఎన్‌కౌంటర్ అని అనేక ప్రజాస్వామ్య సంఘాలు అభిప్రాయపడడం జరిగింది. దానిపై జుడీషియల్ ఎంక్వయిరీ వేయాలని కోరడం కూడా జరిగింది. దానిపై ముఖ్యమంత్రిగారు ముందుకు రాలేదు. అది జరిగివుంటే ఈనాడు మాధవరెడ్డిగారు బలయ్యేవారు కాదని నా వ్యక్తిగత అభిప్రాయం. ఫేక్ ఎన్‌కౌంటర్లకు సర్దిచెప్పవలసి ఉంటుంది. తీవ్రవాద ప్రాంతాలలో అమాయకులను, యువకులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేయడం విడనాడాలి. తీవ్రవాదంలాంటి హత్య, రక్తపాతం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి భిన్నంగా పనిచేసే ప్రతిచర్య కాంగ్రెస్‌పార్టీ ఖండిస్తుంది. మాధవుడు ఎప్పటికీ అమరుడుగా వుంటాడు. నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా ఎన్నికయిన సందర్భంగా 10 సంవత్సరాలు వారితో కలిసి పనిచేసి వారిని అన్నగా గౌరవించే నేను 15 రోజుల క్రితం మా ఏరియాలోని రోడ్ల విషయంలో ఫోన్‌చేస్తే ఇంద్రా ఎన్నికలు అయిన తరువాత రమ్మనమని చెప్పారు. మాకు అన్నగా వున్న మాధవుడు లేడు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

---

**Ms. Della Godfrey (Nominated):-** Madam Speaker, it is really an act of unhuman violence that made us lose a great person like Mr. Madhava Reddy. Sri Reddy has been a person who has been very pleasant. He has always welcomed all of us whenever we have gone to him. I have had the occasion to meet him on some important issue relating to Flying Hospital. Then we suddenly came to know that we needed more police protection and within minutes after I had met him we had the police force that we needed because there were so many people who had come to the Flying Hospital. After that also he called me to him and asked, "Madam, do you feel now that the force is adequate and is there anything else I can do for you?"

Recently, while he was the Minister for Panchayat Raj, though he had a very busy day, I had requested him to spare a few minutes when we had a delegatgion from singapore, who wanted to meet the Hon'ble Minister. They wanted to meet him in connection with the adoption of a village. Then Sri Madhava Reddy sat with us and heard what we wanted to propose for adoption of the village. As a matter of fact, we were in touch with him to take care of one of the village near Chowtuppal. Madam, Mr. Madhava Reddy was a man of vibrant personality. He would always be smiling and many a time would crack a joke with many of his co-legislators. His death is a great loss not only to his family, but also to our Hon'ble Chief Minister and all his colleagues who have been working with him. On behalf of the Christian community, on behalf of Anglo-Indian community, my family and myself, we convey our deep condolences and sympathy to his family and to all those who are dear to him. Madam Speaker, there is a saying that there is no greater deed than to do good for another. Sri Madhava Reddy died while he was on duty. He has braved so much of threat and for the call of duty he has not given up and he has still gone ahead with what he was expected to do. Such people leave a dent in our lives. It is something for us to take an example from. He has died while he was working for the party and for the Government.

Madam Speaker, Sri Madhava Reddy had risen from the grassroot level being a Sarpanch in the Panchayat Raj. He has been Hon'ble Minister for so many years, starting his career at a very early age of around 30 years. It is sad that before he could even reach 50 years, he is not here with us today. To him and his family my deep condolences and we pray to God to grant his soul eternal rest and may his family get all the courage and blessings to bear this great loss.

Thank you for giving this opportunity to speak.

11.50 ఉ. శ్రీ గద్దె బాబూరావు (చీపురుపల్లి):- అధ్యక్షా, మాధవరెడ్డిగారి మృతికి ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. మాధవరెడ్డిగారితో నాకే కాదు, ఈ సభలో వున్న చాలా మందికి చాలా సన్నిహిత, స్నేహ సంబంధాలు వున్న మాట వాస్తవం. అయితే ఆయన ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, రాజకీయ జీవితం కూడా ఒక సామాన్య పంచాయతీ అధ్యక్షుడిగా ప్రారంభించి, ప్రతి మెట్టు ఎంతో కష్టపడి, ప్రజాస్వామ్య పద్ధతిలో పైపైకి వచ్చి పంచాయితీ మంత్రిస్థాయికి చేరుకున్నారు.

ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో వున్న శాసనసభ్యులతో ఆయనకు చాలా సన్నిహితమైన, చనువైన సంబంధాలున్నాయి. పూర్తి పేరు పెట్టో, లేక వెంపమీద కొట్టో లేక ఇంకొక రకంగా పేరు పెట్టో పిలిచే అనుబంధం వున్నమాట వాస్తవం. ఈ పరిస్థితులలో ఆయన అకాల మరణం పార్టీకి, ఈ రాష్ట్రానికి తీరని లోటు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆయన తీసుకురావాలని కలలు కన్న మార్పును తీసుకురాకుండానే వెళ్ళి పోవడం చాలా దురదృష్టకరం.

ధైర్య సాహసాలకు ఆయన పెట్టింది పేరు. ఏది ఏమైనా ఆయన రాజకీయాలలో వచ్చే యువతకు స్ఫూర్తి కావాలని కోరుకుంటున్నాను. అంతేకాకుండా ఆయన చనిపోయిన వైనం, ఎందుకు చనిపోయారని ఆలోచన చేసుకుంటే, చాలాపార్టీల వారు కూడా దీని గురించి మాట్లాడడం జరిగింది. వారి వారి వ్యక్తిగత అభిప్రాయాలను కూడా చెప్పడం జరిగింది. ఏ పార్టీ వారు చనిపోయారు, ఏ పార్టీవారిని తీవ్రవాదులు చంపుతున్నారనే దాని మీద దృష్టి పెట్టకూడదు. వారు అన్ని పార్టీలవారినీ మట్టు పెడుతూనే వున్నారు. హయగ్రీవాచారిగారిని కాని, శ్రీపాదరావుగారిని కాని, పురుషోత్తమరావుగారిని కాని, వారు ఫలానా పార్టీ వారిని చంపలేదు. వారికి వయస్సుతో సంబంధంలేదు. మాధవరెడ్డిగారితో ఈ సమస్య ఆగిపోతుందా? తీవ్రవాదులను జనజీవన స్రవంతిలో కలపడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనేదాని గురించి ఆలోచించాలి. 80 సంవత్సరాల వయస్సులో వుండగా హయగ్రీవాచారిగారిని చంపడం జరిగింది. ఆ రోజున ఈ పార్టీలో ఆయన చేసింది తప్పని కానీ, వారు చేసింది రైటని కాని మాట్లాడకూడదు.

నేను చెప్పేది ఒకటే. వ్యక్తిగత అభిప్రాయాలు తీసుకోకుండా, తీవ్రవాదాన్ని అరికట్టడానికి, ప్రజాస్వామ్యంలోకి వారిని తీసుకురావడానికి సూచనలు ఇవ్వాలని కోరు తున్నాను. దీంట్లో పోలీసుల సమర్థతా, అసమర్థతా అని కాదు. పోలీసులు కూడా చాలా మంది చనిపోతున్నారు. అమాయకులైన వారు కూడా చనిపోతున్నారు.

ఒక్క విషయం తమరి ద్వారా మనవిచేస్తున్నాను. ఏ ప్రభుత్వం వున్నా చంపడం అనేది జరుగుతూనే వుంది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వారు బయటకు రావడానికి అనేక అవకాశాలు కల్పించడం జరిగింది. ఉద్యోగ అవకాశాలు కాని, స్వయం ఉపాధి

అవకాశాలను కాని కల్పిస్తామని వారికి ఒక పిలుపును ఇవ్వడం జరిగింది. మరి వారి ఆశయమేమిటో అర్థం కాలేదు. అవకాశం వచ్చినప్పుడు మా ఉనికి ఇక్కడ వుందని చాటు కోవడం కోసం, పేరున్న వ్యక్తిని చంపితే మా ఉనికి వుంటుందనే ఉద్దేశ్యం తప్ప మరొక ఆశయంతో కాదని మనవిచేస్తున్నాను. తీవ్రవాదులను జనజీవన స్రవంతిలోకి తీసుకు వచ్చేందుకు తోడ్పడవలసిందిగా అన్ని రాజకీయ పార్టీలవారిని కోరుతున్నాను.

మాధవరెడ్డిగారితో నాకు సన్నిహిత సంబంధం వుంది. ఆయన నా పూర్తి పేరు పెట్టి గద్దె బాబూరావు అని పిలిచేవారు. శివాజీగారు కనబడితే వెంప దెబ్బకొట్టి పలకరించేవారు. ఒక్కొక్కరితో ఒక్కొక్క రకంగా స్నేహ సంబంధాలను కొనసాగించేవారు. ఎన్.టి.ఆర్. ట్రస్ట్ భవన్‌కు వెళితే అక్కడ ఆయన ఫోటో చూస్తే ఆయన నిజంగా మేడ దిగి వస్తున్నారని అనిపిస్తుంది. వారికి, వారి దివంగత సెక్యూరిటీ ఆఫీసర్‌కు, డ్రైవర్ నిరంజన్‌కు ఆత్మశాంతిని కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

12.00 మ. శ్రీ వై. రామకృష్ణుడు:- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని మనస్పూర్తిగా బలపరుస్తూ అదేవిధంగా ముఖ్యమంత్రిగారు కాని తదితర వ్యక్తుల అభిప్రాయాలతో పూర్తిగా నేను ఏకీభవిస్తున్నాను. శ్రీ మాధవ రెడ్డిగారు, నేను దాదాపు తెలుగుదేశం పార్టీలో కాని రాష్ట్ర ప్రభుత్వంలో కాని 13 సంవత్సరాలపైన కలసి పనిచేయడం జరిగింది. నాకు చాలా కావలసినటువంటి స్నేహితుడు. అతని మరణవార్త వినగానే తట్టుకోలేనటువంటి పరిస్థితి కూడా ఏర్పడినటువంటి మాట వాస్తవం అనేది ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఎప్పుడు నవ్వుతూ తన భావాలను సుస్పష్టంగా అందరికి చెప్పడమే కాకుండా ప్రజలతోటి ఎంత మంచి సంబంధాలు పెట్టుకొనే వాడో అదేవిధంగా నాయకులతోటి రాజకీయపార్టీలు వేర్వైనా రాజకీయ భావాలు వేర్వైనప్పటికి ఎప్పుడు కూడా స్నేహాన్ని చెక్కుచెదరనీయకుండా అందరితోటి కలసి మెలసి ఉండేటటువంటి ప్రజల మనిషి అనేది చాలా సుస్పష్టంగా కూడా అందరికి తెలుసు అనేది కూడా ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మాధవరెడ్డిగారి యొక్క ఆలోచనతోటి మనం ఒకసారి చూసినట్లయితే రెండు విషయాల్లో ఒకటి సిద్ధాంతానికి కట్టుబడి తాను నమ్మినటువంటి సిద్ధాంతమే కాకుండా ఈ రాష్ట్రానికి సరైనటువంటి న్యాయం చేయాలనే ఆలోచనతోటి నడిచినటువంటి వ్యక్తి అని కూడా మనవిచేస్తున్నాను. అతను హోం మంత్రిగా పని చేసినపుడు ఒక విధమైనటువంటి చక్కదనాన్ని తీసుకురావడమే కాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడితే తప్ప రాష్ట్రానికి మేలు జరగదు అనేటటువంటి నమ్మకమైనటువంటి వ్యక్తి. అందుచేత తన ప్రాణాలను లెక్కచేయకుండా తన ఆలోచనతోటి మొదటి నుంచి చివరి దాకా నమ్మకముగా కార్యక్రమాల్లో నిమగ్నమై వుండేవారు. ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉండాలి, ప్రజలు ప్రశాంతమైనటువంటి జీవితం గడపాలి, ఆ రోజునే రాష్ట్రంలో అన్ని రంగాలల్లో అభివృద్ధి జరుగుతుందని నమ్మకంతో పనిచేసేనటువటి గొప్ప వ్యక్తి అని మనవిచేస్తున్నాను. అది ఒక ఉదాహరణ. రెండవది పంచాయితీరాజ్ మంత్రి అయిన కొద్ది సమయంలోనే ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉండేటటువంటి క్లిష్టమైనటు వంటి పరిస్థితిని ఎంపిటిసిలు జడ్‌పిటిసిలు ఈ వ్యవస్థ మంచిది కాదు. ఈ పంచాయతీరాజ్

వ్యవస్థ కుంటుపడేటటువంటి ప్రమాదం ఉన్నదని ఆలోచనచేసి దానిని ఏ విధమైనప్పటికి కూడా ఎమెండుమెంటు ద్వారా దానిని తీసివేయాలని ఆలోచన చేయడమే కాకుండా మొత్తం క్యాబినెట్‌ను కన్విన్సు చేసి, నేషనల్ లీడర్సు దగ్గరకు వెళ్లి ఎమెండుమెంటు తీసుకొని రావాలని పంచాయితీరాజ్ వ్యవస్థ బాగుండాలనేటటువంటి ఆలోచనతో పట్టుదలతో కృషి చేసినటువంటి వ్యక్తి అని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఆ విధంగా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేయడం ఎవరిని కూడా ఇబ్బంది పెట్టకుండా ప్రజలకు ఏమి న్యాయం చేయాలో ప్రజలయొక్క ఆలోచనలకు అనుగుణంగా పనిచేసేటటువంటి ఒక మంచి వ్యక్తిని మనం కోల్పోవడం చాలా దురదృష్టకరం అని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అందుచేత ఈనాడు రాష్ట్రంలో, దేశంలో కాని అభివృద్ధి కార్యక్రమాలు జరగవలసినటువంటి అవసరం వుంది. అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే ప్రశాంతమైనటువంటి వాతావరణం ఉండవలసిన అవసరం కూడా వున్నది. అందుచేత ఏ సంస్థ అయినా వ్యవస్థ అయిన లేకపోతే వ్యక్తి అయినప్పటికి ఎప్పుడు కూడా ఈ ప్రజాస్వామ్యంలో పేద వర్గాలవారికి బడుగువర్గాల వారికి వెనుకబడినటువంటి ప్రాంతాలు అభివృద్ధి జరగాలనప్పుడు న్యాయం జరగాలన్నప్పుడు అందరి సహకారం కూడా కావలసిన అవసరం ఉన్నదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈ ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే నిశ్చలమైనటువంటి మనస్సుతోటి నిర్దుష్టమైనటువంటి కార్యక్రమం తోటి ముందుకు వెళుతున్నటువంటి సందర్భంలో ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి మేదావులే కాదు, వ్యవస్థలోనే కాదు, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రాజకీయ పార్టీలే కాదు అందరి యొక్క సలహాలు, అందరియొక్క ప్రమేయం తీసుకోడానికి ముఖ్యమంత్రిగారు సిద్ధంగా వున్నారు. అందుకనే ఎప్పుడు కూడా ఎవరైతే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేస్తున్నటువంటి వాళ్ళు ఉన్నారో వాళ్ళు అందరు కూడా ముందుకు రావాలి. వాళ్ళు అంతా మెయిన్ స్ట్రీమ్‌లోకి రావాలి. వాళ్ళయొక్క ఆలోచనలు ఇవ్వాలి తదనుగుణంగా వాళ్ళ అయిడియాలజీ, ఇచ్చినట్లయితే ఎవరి ఐడియాలజీ అయినా కూడా ఈ ప్రజాస్వామ్యంలో పనిచేసేటటువంటి వాళ్ళయొక్క ఆలోచనలు ఎప్పుడు కూడా ఒకేలాగ ఉంటాయి. అదేవిధంగా ప్రతియొక ఆలోచన కూడా – ఒకటి కావాలి. ఇన్నాళ్ళకు మనకు కావలసినటువంటి సిద్ధాంతాలకు అనుగుణంగా మనం అభివృద్ధి చేయాలి. మనకు ఉన్నటువంటి వెనుకబడిన తనాన్ని పారద్రోలాలి, మనకు ఉన్నటువంటి పేదరికాన్ని పారద్రోలాలి. మనకు ఉన్నటువంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి చేయాలనే సిద్ధాంతంతోటి ఈ ప్రభుత్వం పనిచేస్తున్నటువంటి సమయంలో ఎవరైనప్పటికి కూడా ముందుకువచ్చి, మెయిన్‌స్ట్రీమ్‌లోకి వచ్చి వాళ్ళయొక్క ఆలోచనలు ఇచ్చినట్లయితే వాళ్ళ ఆలోచనలు కూడా పరిగణనలోకి తీసుకొని రాష్ట్రాన్ని అన్ని రంగాలో్ల అభివృద్ధి చేయడ్డానికి పనిచేస్తున్నటువంటి సమయంలో ఇటువంటి దారుణమైనటువంటి ప్రయత్నం జరగడ్డం చాల్లా తీవ్రమైనదిగా మనవిచేస్తున్నాను. ఏదిఏమైనప్పటికీ ఒక మంచి మిత్రుడ్ని కోల్పోవడం, ఈ సభలో ఒక మంచి మిత్రునియొక్క సంతాప తీర్మానం ప్రవేపెడతామని కలలో కూడా అనుకోలేదు. ఈ రోజు అటువంటి దురదృష్టమైన పరిస్థితి ఏర్పడినందుకు చింతిస్తూ వారియొక్క కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియపరుస్తూ మాధవరెడ్డిగారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. మాధవరెడ్డి మృతిపట్ల సంతాపము.

మేడమ్ స్పీకర్:- ఆంధ్రప్రదేశ్ శాసనసభా సభ్యులు శ్రీ ఎ. మాధవరెడ్డిగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది.

శ్రీ ఎ. మాధవరెడ్డిగారు 1949 లో భువనగిరి మండలంలో వడపర్తి గ్రామంలోని రైతు కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగు పట్టా తీసుకున్నారు. విద్యార్థి దశలోనే ఆయన నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి విద్యార్థి సంఘాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశేవారు. వృత్తి రీత్యా ఇంజనీరయినా 1981లో రాజకీయరంగంలో కాలుమోపి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ సంవత్సరమే భువనగిరి పంచాయతీ సమితి అధ్యక్షుడిగా కూడా గెలుపొందారు. 1985లో జరిగిన సాధారణ ఎన్నికలలో భువనగిరి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరఫున తొలిసారిగా శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. తరువాత వరుసగా 1989, 1994 మరియు 1999లలో జరిగిన సాధారణ ఎన్నికలలో అదే నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరఫున శాసనసభ్యునిగా గెలుపొందారు. 1989, ఫిబ్రవరిలో మొదటిసారి హోం మరియు సినిమాటోగ్రఫీ మంత్రిగా ఎన్నికయ్యారు. 1994 నుండి ఆయన మొదట వైద్య మరియు ఆరోగ్య శాఖామంత్రిగా తరువాత హోం మరియు సినిమాటోగ్రఫీ మంత్రిగా తన పాత్రను సమర్థవంతంగా పోషించారు. 1999 సాధారణ ఎన్నికల తరువాత ఆయన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. హోం మంత్రిగా పోలీసు శాఖలో విప్లవాత్మకమైన మార్పుల కోసం మరియు తెలుగు చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశారు. సర్పంచి స్థాయి నుండి ఎదిగిన నాయకుడు కావున స్థానిక సంస్థల స్వరూప స్వభావాలపై మంచి అవగాహన కలిగి ఉండి పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులకు సంస్కరణలకు కృషి చేశారు. కాబినెట్ మంత్రిగా అటు రాష్ట్రంలోనూ ఇటు నల్గొండ జిల్లా లోను కీలకమయిన పాత్రపోషిస్తూ, ముఖ్యంగా వెనుకబడిన నల్గొండ జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిది.

ఉన్నత విలువలతో, మృదు స్వభావంతో సామర్థ్యం, సౌజన్యం చురుకుదనం, మేళవించిన వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందిన స్నేహశీలి, అకుంఠిత దీక్షాపరుడు, పరిపాలనాదక్షుడు అయిన ఈ ప్రజా నాయకుడు మందుపాతరకు బలి అయి చిన్న వయస్సులో దారుణంగా మరణించడం మన రాష్ట్రానికి ఎంతో తీరనిలోటు, ఎంతో బాధాకరం.

వీరి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషములపాటు మౌనం పాటిద్దాము.
(సభ్యులు అందరూ తమ స్థానాలలో నిలబడి రెండు నిముషములు మౌనం పాటించారు.)

Now, the House is adjourned to meet again at 9.00 A.M. on Tuesday, the 21st of March, 2000.

(The House then adjourned at 12-07 PM to meet again at 9-00 AM on 21-3-2000.